ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

శనివారం 19 అక్టోబరు 2024 | 5

సత్య దీక్షకు వేళాయె..

- ఈ నెల 27న ప్రారంభం
- నవంబరు 6న 8 రోజుల దీక్ష
- 14న తొమ్మిది రోజుల దీక్ష
- 23న ఇరుముడి సమర్పణ

7

ఇదేంటి స్వామీ?



- అన్నవరం సత్యదేవుడి నైవేద్యాల తయారీకి కల్తీ బెల్లం వాడకం
- భక్తులకు అందించే ప్రసాదాలు సైతం కల్తీ బెల్లంతోనే తయారీ
- శాంపిళ్ల పరిశీలనలో నిజాలు నిగ్గు తేల్చిన ఆహార కల్తీ నిరోధకశాఖ
- దేవస్థానానికి సరఫరా అయ్యే బెల్లం అంతా పంచదారే కలిసినట్లు నిర్ధారణ
- గతనెల వరకు విశాఖకు చెందిన ఓ కంపెనీ కిలో బెల్లం రూ.50చొప్పున సరఫరా
- ఈనెల నుంచి అదే కంపెనీకి మళ్లీ టెండరు.. కిలో రూ.48 చొప్పున సరఫరా
- త్వరలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు వేయనున్న అధికారులు
- ఇప్పటికే సరఫరా అయిన నెయ్యిలోను కల్తీ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అన్నవరం సత్యదేవుడి ఆలయంలో మరో కల్తీ బయటపడింది. స్వామివారికి వడ్డించే నైవేద్యాల్లో కల్తీ బెల్లం అడ్డంగా కలిసిపోతోంది. అసలేం తనిఖీ చేయకుండా నాణ్యతను పరిశీలించకుండా అడ్డగోలుగా కల్తీ బెల్లాన్ని అధికారులు వినియోగించేస్తున్నారు. తాజాగా జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులు దేవస్థానానికి సరఫరా అయ్యే బెల్లం కల్తీ గుట్టు నిగ్గు తేల్చారు. కొన్ని శాంపిళ్లను పరిశీలనకు పంపగా అందులో అధికంగా పంచదార కలిసినట్లు తేలింది. ఈ నేపథ్యంలో కల్తీబెల్లం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై జేసీ కోర్టులో ఆహారకల్తీ నిరోధకశాఖ అధికారులు కేసు దాఖలు చేయబోతున్నారు.

ఇదేంటి స్వామీ..

అన్నవరం దేవస్థానం ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఏటా లక్షల భక్తులు ఆలయానికి వస్తుంటారు. కొండపై స్వామివారికి నైవేద్యాల దగ్గరనుంచి భక్తులకు ప్రసాదాల వరకు అధికారులు జాగ్రత్తలు తీసుకుని నాణ్యమైన సరుకులను వినియోగించాలి. కానీ ఆచరణలో ఇదెక్కడా కనిపించడం లేదు. ఇప్పటికే దేవస్థానానికి సరఫరా అయ్యే నెయ్యి నాణ్యతపై అనేక అనుమానాలు, అవినీతి జరిగిన వైనం వెలుగులోకి వచ్చింది. బయట మార్కెట్లో ధర కంటే అత్యంత తక్కువ ధరకు గత వైసీపీ సర్కారు హయాంలో రైతు డైరీ అనే కంపెనీ నెయ్యిని సరఫరా చేసింది. దీని నాణ్యతపై కథనాలు ఆంధ్రజ్యోతిలో రావడంతో అధికారులు శాంపిళ్లను పరిశీలనకు పంపగా, ప్రాథమికంగా ఇందులో నాణ్యత లేదని తేలుతోంది. ఇప్పటికే ఈ నెయ్యిపై అనుమానంతో ఇటీవల కాంట్రాక్టర్‌ను మార్చి దీనిస్థానంలో దేవస్థానానికి ప్రభుత్వ విజయ డెయిరీ నెయ్యిని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా మరో విస్తుపోయే నిజం వెలుగులోకి వచ్చింది. దేవస్థానానికి సరఫరా అయ్యే బెల్లం కూడా కల్తీయేనని తేలింది. కొండపైకి నెలకు 300కిలోల వరకు బెల్లం అవసరం. ఈ బెల్లంతో అన్నదానం, స్వామివారికి మహానివేదన, ప్రతి ఆదివారం భక్తులకు క్షీరాన్న ప్రసాదం పంపిణీ చేస్తారు. ఈ బెల్లమంతా కిలో రూ.50 చొప్పున విశాఖకు చెందిన సూర్యకుమారి ఏజెన్సీ సరఫరా చేస్తోంది. కానీ ఇది కల్తీ బెల్లంగా తాజాగా నిర్ధారణ అయింది. ఈ బెల్లంతోనే స్వామికి నిత్యం మహానివేదిన, భక్తులకు వడ్డించే అన్నప్రసాదం తయారు చేస్తున్నారు. స్వామికి వినియోగించే ప్రతి వస్తువు ఎంత ఖరీదైనా సరే పూర్తి నాణ్యతతోనే తయారు కావాలి. కానీ అధికారులు ఇదేదీ పట్టించుకోవడం లేదు. కొండపైకి కావాల్సిన సరుకుల విషయంలో టెండర్లు పిలిచి తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు పని అప్పగిస్తున్నారు. తీరా పోటీలో తక్కువ ధరకు కోట్ చేసిన వ్యాపారి పంపే సరుకుల నాణ్యత పరిశీలించకపోవడం అనర్థాలకు దారితీస్తోంది. కొండపైకి కాంట్రాక్టర్లు ఏ సరుకు తెచ్చినా తక్షణం ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులకు సమాచారం పంపాలి. కానీ కొండపై ఇదేదీ జరగడం లేదు.

అంతా సుక్రోజే..

దేవస్థానానికి నెలకు 300 కిలోల బెల్లం అవసరం. దీంతోనే మహా నివేదన, ఇతర వంటకాలు తయారు చేస్తారు. ఇటీవల తిరుపతి లడ్డూ వ్యవహారంలో నకిలీ నెయ్యి ఘటన వెలుగులోకి రావడంతో అన్నవరం కొండకు సరఫరా అయ్యే నెయ్యిలోను కల్తీ అనుమానాలు, ఒకే కాంట్రాక్టర్‌కు తక్కువ ధరకు సరఫరా బాధ్యత వ్యవహారం అప్పగించిన ఘటనపై ఆంధ్రజ్యోతిలో గత నెల 21న ప్రసాదంలోను గీకుడేనా, 24న అన్నవరం కొండపై అవి'నేతి' అంటూ కథనాలు వచ్చాయి. దీంతో జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు వచ్చి దేవస్థానానికి సరఫరా అవుతున్న నెయ్యి, బెల్లం, గోధుమరవ్వ తదితర సరుకుల శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఇంకా నెయ్యికి సంబంధించి నివేదికలు రావాల్సి ఉండగా బెల్లానికి సంబంధించి పూర్తి కల్తీగా నివేదికలో తేలింది. ఆలయానికి సరఫరా అవుతున్న బెల్లంలో పంచదారను కలిపి తయారు చేసి సరఫరా చేస్తున్నట్లు అధికంగా గుర్తించారు. ఈ కల్తీ బెల్లంలో సుక్రోజ్‌శాతం అధికంగా తేలింది. దీంతో కల్తీ బెల్లంగా అధికారులు నిర్ధారణకు వచ్చారు. దీన్నిబట్టి స్వామివారికి అందించే మహానైవేద్యంలో ఏస్థాయిలో కల్తీతో కూడిన ప్రసాదాలు అధికారులు తయారు చేయిస్తున్నారో అనేది అర్థమవుతోంది. బయట మార్కెట్లో కిలో నల్ల బెల్లం రూ.80 వరకు ఉంది. ఇది పూర్తిగా బెల్లం మినహా ఏ కల్తీ జరగదు. కానీ కొంచెం తెల్లగా ఉండే బెల్లం రూ.50కే లభ్యమవుతోంది. దేవస్థానానికి కిలో రూ.50 చొప్పున బెల్లం సరఫరాచేసే విశాఖకు చెందిన సూర్య కుమారి ఏజెన్సీ అనే సంస్థ నాసిరకమైన బెల్లాన్నే సరఫరా చేస్తోంది. పైగా ఈ కంపెనీ ఈనెల నుంచి మళ్లీ రెండెసారి టెండరు దక్కించుకుని ఈసారి కిలో రూ.48కే సరఫరా చేస్తోంది. దీన్నిప్రకారం ధర పెరగాలి గానీ మళ్లీ తగ్గించి సరుకు సరఫరా చేస్తుండడం విశేషం. బెల్లం కల్తీపై నిర్ధారణకు వచ్చిన జిల్లా ఆహార కల్తీనిరోధకశాఖ అధికారులు త్వరలో జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు దాఖలు చేయాలని నిర్ణయించారు. దేవస్థానానికి కల్తీ బెల్లం సరఫరా చేయడాన్ని, తద్వారా స్వామివారికి, భక్తులకు వడ్డించే ప్రసాదాలు కల్తీ అయ్యాయని పేర్కొంటూ కేసులో ప్రస్తావించనున్నారు.

ధాన్యం సేకరణకు..

సర్వం సిద్ధం

- జిల్లావ్యాప్తంగా 277 కొనుగోలు కేంద్రాలు
- మరో మూడు రోజుల్లో కేంద్రాలు ప్రారంభం
- ధాన్యం సేకరణ లక్ష్యం 4.35 లక్షల టన్నులు
- రైతు కోరిన మిల్లులకు ధాన్యం తరలింపు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులను పండించిన ఖరీఫ్ ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా 277 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మరో మూడు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలు (రైతు సేవా కేంద్రాలు) సిద్ధంగా ఉన్నాయి. మొత్తం ధాన్యం ఉత్పత్తి 5.45లక్షలు టన్నులు కాగా దీనిలో పౌరసరఫరాలశాఖ ద్వారా 4.35లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. సేకరించిన ధాన్యాన్ని మరపట్టించి సీఎంఆర్ కింద పౌరసరఫరాల సంస్థకు ఇచ్చేందుకు మిల్లర్లు ముందుకొచ్చారు. ఇప్పటివరకు సీఎంఆర్ రైస్ మిల్లలకు ర్యాండమైజేషన్ ద్వారా ధాన్యం కేటాయించేవారు, దీనివల్ల సుదూరాల్లో ఉన్న మిల్లులకు ధాన్యం తరలించడం కష్ట సాధ్యమయ్యేది. ఈ విధానాన్ని సీఎం చంద్రబాబు రద్దు చేసి నూతన విధానానికి నాంది పలికారు. రైతు కోరిన మిల్లులకు ధాన్యాన్ని తరలించే అవకాశం కల్పించారు.

మద్దతు ధరలు

సాధారణ రకం క్వింటాకు రూ.2300 ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుంది. గ్రేడ్ఏ రకం క్వింటాకు రూ.2320 ఇచ్చి కొనుగోలు చేస్తోంది. 75కిలోల బస్తా సాధారణ రకం రూ.1725, గ్రేడ్ ఏరకం రూ.1740కు కొనుగోలు చేస్తుంది. ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి సేకరిస్తారు. మట్టి, రాళ్లు, ఇసుక ఒక శాతం వరకు అనుమతిస్తారు. గడ్డి, చెత్త కలుపు ఒకశాతం వరకు, చెడిపోయిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యం 4శాతం వరకు అనుమతిస్తారు. తేమ 17శాతం వరకు. పరిపక్వం కాని ధాన్యం 3శాతం వరకు, కేళీలు ఏ-గ్రేడ్‌లో 6శాతం వరకు అనుమతిస్తారు. ధాన్యం సేకరణకు 20లక్షల గోనెసంచులు సిద్ధం చేశారు. 414 తేమ యంత్రాలు, 538 వేబ్రిడ్జిలు, 1700 వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో అన్ని మండలాల్లో ధాన్యం సేకరణకు సిబ్బందిని సిద్ధం చేశారు. వీరికి శిక్షణ కూడా ఇచ్చారు.

48గంటల్లో సొమ్ము జమ

రైతులు విక్రయించిన 48 గంటల్లో సొమ్ములు జమ చేస్తాం. ప్రభుత్వం కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుంది. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు. ప్రతి ఒక్క రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.

-దేవుల నాయక్,
పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

కేంద్ర బీమా పథకాల్లో చేరాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న మూడునెలలపాటు గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న జనసురక్ష కార్యక్రమాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ అత్యంత ప్రయోజనదాయకమైన కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల్లో నమోదు పొందేలా చూడాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాలో గ్రామస్థాయి జనసురక్ష కార్యక్రమం వివరాల గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సూచన మేరకు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలపై ఈనెల 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు జనసురక్ష పేరిట అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అవగాహన, నమోదు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఏడాదికి రూ.436 ప్రీమియంతో జీవిత బీమా, రూ.20 ప్రీమియంతో ప్రమాద బీమాల కింద రూ.2లక్షల ఇన్సూరెన్స్ కవరేజీ నమోదు చేసుకున్న వారికి ఈ పథకాలు అందిస్తున్నాయన్నారు. జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, ఎల్డీఎం ప్రసాద్, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో పాల్గొన్నారు.



కాకినాడ నగరంలో జోరుగా కురుస్తున్న వర్షం



కెరటాల ధాటికి ధ్వంసమైన కాకినాడ -ఉప్పాడ బీచ్‌రోడ్డు



భారీవర్షానికి మునిగిన కరప మండల పరిషత్ కార్యాలయం

అక్కడక్కడా వాన..

- కెరటాల ధాటికి ధ్వంసమైన ఉప్పాడ బీచ్‌రోడ్డు
- వర్షాలకు రహదారులు గోతులమయం

కొత్తపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం అక్కడక్కడా వాన పడింది. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కారణంగా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కొత్తపట్నం నుంచి విద్యుత్‌ప్లాంటు, నేమాం వరకు బీచ్‌రోడ్డు అలల ధాటికి ధ్వంసమైంది. అల్పపీడనానికి పౌర్ణమి తోడు కావడంతో సముద్రం మరింత ఉప్పొంగుతూ బీచ్‌రోడ్డును తాకుతోంది. దీంతో ఉప్పాడ శివారు కొత్తపట్నం, సుబ్బంపేట, విద్యుత్‌ప్లాంటు, నేమాం వద్ద రోడ్డులో గుంతలు పడ్డాయి. దీంతో ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

భారీవర్షానికి రహదారులు జలమయం

కరప/సామర్లకోట, అక్టోబరు 18: కాకినాడ, సామర్లకోట, కరప ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం కురిసిన భారీవర్షానికి రహదారులు జలమయమయ్యాయి. కాకినాడ-కోటిపల్లి, కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రహదారులు పలు చోట్ల ముంపునకు గురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాకినాడ నగరంలోను పలు రహదారులు నీటమునిగాయి. వర్షానికి కరప మండల పరిషత్ కార్యాలయం ఆవరణ పూర్తిగా మునిగిపోయింది. ఎంఈవో కార్యాలయం, గురుకులపాఠశాల, కరప జడ్పీ ఉన్నతపాఠశాల ముంపునకు గురయ్యాయి. సామర్లకోట మీదుగా కాకినాడ-చేట్లపాలెం కెనాల్ రోడ్డులో పెద్దగోతులు ప్రమాద భరితంగా మారాయి. ఈ దారిలో వెళ్తున్న లోడు ట్రాక్టర్ మాండవ్య నారాయణస్వామి ఆలయానికి వెళ్లే వంతెన సమీపించేసరికి పెద్దగోతిని తప్పించే ప్రయత్నంలో బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో పక్కకు దూకేయడంతో పెను ప్రమాదం తప్పింది.



సామర్లకోట కెనాల్ రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టర్

అర్జీలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రజా విజ్ఞాపనలపట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ షాన్ మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదులపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన ప్రజాసమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. అర్జీదారులు సంతృప్తి ప్రధాన లక్ష్యంగా సక్రమమైన పరిష్కారాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. గత 15 రోజుల్లో వచ్చిన దరఖాస్తులపై ప్రతివారం సమీక్షిస్తామన్నారు. హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్ పనులు గ్రౌండింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. గృహనిర్మాణాలపై ప్రత్యేకదృష్టి పెట్టి స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. అక్టోబరు చివరనాటికి అన్ని ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేలా పారిశ్రామికరణకు, బరియల్ గ్రౌండ్స్, డంపింగ్‌యార్డు, హైవేలకు అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు.

వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కలెక్టరేట్ వివేకానంద సమావేశమందిరంలో అడల్ట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అండర్ స్టాండింగ్ ఆఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ ఉల్లాస్ పథకాలపై జిల్లాస్థాయి కన్వర్జేషన్స్ సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంలో భాగంగా ఉల్లాస్ పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. దేశంలో 100శాతం అక్షరాస్యతను సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. 15ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉండి చదువు ఆపేసిన, చదువుకోని పెద్దలను గుర్తించి అక్షరాస్యతను అందించి వారికి ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, ఆర్థిక విద్యను వలంటీర్ టీచర్ ద్వారా అందించడమే ఉల్లాస్ పథకం లక్ష్యమన్నారు. ఈనెల 24 వరకు డీఆర్డీఏ క్లస్టర్ కోఆర్డినేటర్, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో నిరక్షరాస్యుల సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈపథకం ద్వారా గుర్తించిన నిరక్షరాస్యులను నవంబరు 5 నుంచి మార్చి 15 వరకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ పోసయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, డీఈవో రమేష్, జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్, సమాచార పౌరసంబంధాలశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున పాల్గొన్నారు.



స్కేటింగ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

కాకినాడలో రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు ప్రారంభం 6

మునిసిపాలిటీల్లో ఈ-ఆఫీస్



కూటమి ప్రభుత్వం ఈ-ఆఫీస్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. మున్సిపాలిటీల్లో ప్రతి ఫైల్ ఈ-ఆఫీస్ ద్వారానే పంపాలని ఆదేశాలు జారీ చేసింది. తద్వారా ఫైళ్లు ఉండవని భావిస్తోంది. వచ్చేనెల 15 లోగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించింది. 30వతేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయాల్సి ఉంటుందని మున్సిపల్ శాఖ డైరెక్టర్(డీఎంఏ) నుంచి మున్సిపాలిటీలకు ఆదేశాలు అందాయి. దీంతో ఈ-ఆఫీస్ పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

- ఇక అన్ని ఫైల్స్ ఈ-ఆఫీస్ ద్వారానే చేయాలని ఆదేశం
- మున్సిపాలిటీల్లో నిర్వహణకు చర్యలు
- వచ్చే నెల 30 వరకూ గడువు

పెద్దాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ-ఆఫీస్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలుచేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం కొలువు తీరాక ఈ-ఆఫీస్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. మొక్కుబడిగానే నిర్వహించారు. దీంతో పనుల్లో పారదర్శకత లేకుండా పోయింది. జవాబుదారీతనం కూడా కరువైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ-ఆఫీస్‌ను పటిష్టంగా అమలు చేసే దిశగా అడుగులు వేస్తోంది. అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ విధానంలో పంపాలంటూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ) నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అత్యవసర ఫైళ్లను మాత్రమే మాన్యువల్‌గా నిర్వహించుకునే వెసులుబాటు కల్పించింది. మిగతా ఫైళ్లు అన్నీ ఈ-ఆఫీస్‌లోనే ఉండాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో మళ్లీ ఈ-ఆఫీస్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కమిషనర్లు ఇప్పటికే అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇకపై ఫైళ్లను ఈ విధానంలోనే అన్ని శాఖలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో బదిలీలు జరిగి కొత్త ఉద్యోగులు బాధ్యతలను చేపట్టిన నేపథ్యంలో ఈ విధానంపై కసరత్తు చేస్తున్నారు. గతంలో ఎలా నిర్వహించారన్న దానిపై ఆరా తీస్తున్నారు. ఫైళ్ల లో జాప్యాన్ని అరికట్టేందుకు కొత్త విధానం దోహదపడుతుందని అంటున్నారు. మున్సిపాలిటీల అనంతరం మిగతాశాఖలకు కూడా ఈ-ఆఫీస్‌ను పరిచయం చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

పారదర్శక విధానం..

ఈ-ఫైల్ విధానం పారదర్శకంగా ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఫైల్ ఎక్కడ ఆగిపోయిందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. ఫైళ్ల పరిస్థితిని ఉన్నతాధికారులు కూడా చూసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. పరిపాలన సమర్థవంతంగా సాగుతుందని, పెండింగ్ అనేది ఉండదని అంటున్నారు. అందువల్లే కూటమి ప్రభుత్వం ఈ-ఆఫీస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తుందని అంటున్నారు. ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు రావడంతో మున్సిపాలిటీల్లో ఉద్యోగులు కూడా ఈ-ఆఫీస్‌పై త్వరితగతిన అవగాహన పెంచుకునే పనిలో పడ్డారు.

ఐదు విభాగాల్లో కీలకం..

మున్సిపాలిటీల్లో పరిపాలన, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్యం, ఇంజనీరింగ్, అకౌంట్స్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి ఫైల్స్ ఎక్కువగా ఉంటాయి. వీటికి సంబంధించి ఫైల్స్ ఈ-ఆఫీస్ ద్వారానే అమలు చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం గతంలో అమలుకు చర్యలు తీసుకుంది. దీంతో ఈ విధానం అమలవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం కూడా ఈ విధానాన్ని కొనసాగించినా పూర్తిగా అమలు చేయలేదన్న ఆరోపణలున్నాయి.

ఈ-ఆఫీస్‌తో పారదర్శకత: పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం



ఈ విధానం ద్వారా పారదర్శకత ఉంటుంది. ఫైల్ ఎక్కడ ఆగిపోయిందో తెలుసుకునే వీలుంటుంది. ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. ఫైల్స్ విషయాన్ని ఉన్నతాధికారులు కూడా చూసుకునే వీలుంటుంది. పరిపాలన సమర్థవంతంగా సాగుతుంది. పెండింగ్ అనేదే ఉండదు.



వరదల్లో శబరి బ్రిడ్జి



శబరి బ్రిడ్జి

గిరిజనుల వారధి..

శబరి బ్రిడ్జికి 20 ఏళ్లు!

చంద్రబాబు హయాంలో నిర్మాణం

(కూనవరం - ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆ బ్రిడ్జి కోసం ఎందరో గిరిజనులు కలలు కన్నారు. తమకు వైద్య సేవలందక ఎందరో ఇబ్బందిపడ్డారు. మరికొంతమంది శబరి నదిపై వంతెన లేక వైద్య సేవలందక మృత్యువాత పడిన వారూ ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలో వీఆర్‌పురం చివరి మండలం. కూనవరం రాగానే మధ్యలో శబరి నది ఉండడంతో వీఆర్‌పురం మండలవాసులకు రాకపోకలు స్తంభించేవి. పగటిపూట పడవ నడిపిన రాత్రి పూట పడవ సదుపాయం లేకపోవడంతో ఖమ్మం, భద్రాచలం ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవాళ్లు స్వగ్రామం చేరుకోలేక కూనవరంలోనే రాత్రంతా ఉండవలసి వచ్చేది. తమ కష్టాలు చూసిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2000 సంవత్సరంలో శబరి బ్రిడ్జికి మోక్షం కలిగించారు. శబరి బ్రిడ్జికి ప్రత్యేక నిధులు కేటాయించారు. దీంతో శబరి బ్రిడ్జి పనులు వేగవంతంగా జరిగాయి. తర్వాత 2004లో అప్పటి రోడ్ల భవనాల శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు శబరి బ్రిడ్జిని ప్రారంభించారు. దీంతో వీఆర్ పురం వాసులకు బాహ్య ప్రపంచానికి మార్గాలు ఏర్పడ్డాయి. అంతేకాక విద్యార్థుల చదువుకు, రోగులకు వైద్యం అందేలా శబరి బ్రిడ్జి ఎంతగానో దోహదపడుతోంది. గోదావరి వరదల్లో రెండుసార్లు బ్రిడ్జి పూర్తిగా మునిగినప్పటికీ పటిష్ఠంగానే ఉంది. అంతేకాకుండా వీఆర్‌పురం మండలవాసులు భద్రాచలం నుంచి నిత్యావసర వస్తువులు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా వైద్యం కావాలన్నా ప్రతీ వరదల సమయంలో అన్ని వేళలా ఉపయోగపడుతోంది. ఈ బ్రిడ్జి 2024 నాటికి 20 ఏళ్లు పూర్తిచేసుకుని ప్రజలకు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తూనే ఉంది.



పరవశించి పోయేలా..

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం - దెబ్బగూడెం మార్గంమధ్యలో శుక్రవారం సాయంత్రం కనువిందు చేసిన దృశ్యం - మోతుగూడెం



బొమ్మల పెళ్లి జరుపుతున్న దృశ్యం

కనుల పండువగా బొమ్మల పెళ్లి

పిఠాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిజజీవితంలో జరిగే వివాహాన్ని తలపించేలా బొమ్మల పెళ్లి జరిగింది. ఈ పెళ్లిని తిలకించేందుకు మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని శిష్టికరణాల వీధిలో ఉన్న పుర్హుతికా అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా బొమ్మల పెళ్లి నిర్వహించడం ఆనవాయితీ. ప్రాచీన సంప్రదాయాలను కొనసాగించి అందరికీ తెలియచెప్పడంతోపాటు ఇలా పెళ్లి చేస్తే అందరికి మంచి జరుగుతుందన్న నమ్మకంతో ఈ వివాహ మహోత్సవాన్ని ఏటా మాదిరిగానే శుక్రవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా పెండ్లికుమార్తెను నార్ల మహంతి సూరిబాబు, సుబ్బలక్ష్మి దంపతులు, పెండ్లి కుమారుడిని పడాల కుటుంబ సభ్యులు ప్రదర్శనగా వివాహ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పెండ్లి కుమార్తె, కుమారుడికి దగ్గరుండి ఏలూరి సూర్యనారాయణ, నాగరత్నం దంపతులు వివాహక్రతువును జరిపించారు. పెళ్లికుమారుడి కాళ్లు కడిగి కన్యాదానం చేయడం, పెండ్లికుమారుడు, కుమార్తెల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచి ముహుర్తానికి పెళ్లి జరిపించడం, సూత్రధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను అర్చకులు నిర్వహింపచేశారు. పెళ్లి అనంతరం విందు కూడా ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీపుష్ప యాగం నిర్వహించనున్నారు.



అతిథుల రాక..



పులసకు బైబై!

- ఏకంగా మూడు నెలలు వరదలు
- ఉప్పొంగినా జాడ లేని పులసలు
- అక్కడక్కడా దొరికినా ధర వేలల్లోనే
- ఒడిశా విలసలే చెలామణి
- మత్స్యకారులకూ తీవ్ర నిరాశే

పుస్తెలమ్మి అయినా పులస పులుసు తినాలనేది సామెత. గోదారోళ్ల కాస్త ఎటకారం ఎక్కువ.. అందుకే అలా చెబుతారని అనుకోవచ్చుగాని, వాటి ధరలు చూస్తే ఇది నిజమేనని నమ్మక తప్పదు. ఒకటో రెండో దొరికినా కిలో నుంచి రెండు కిలోలలోపు పులస ధర రూ.17 వేల నుంచి 25 వేల వరకు పలుకుతోంది. ప్రస్తుతం పులసల సీజన్ చివరికి వచ్చేసింది. అయినా గోదావరి పరీవాహక ప్రాంతంలో ఈసారి పదుల సంఖ్యలోనే పులసలు దొరికాయి. దశాబ్దం కిందట వందల సంఖ్యలో పులసల వేట సాగేది. గోదావరికి వరద నీరు (ఎర్ర నీరు) తగిలినపుడు ఇతర దేశాల నుంచి బంగాళాఖాతం సముద్రంలోకి వచ్చిన ఈ చేపలు గోదావరిలోకి చేరి ఏటికి ఎదురీదుతాయి. ఆ సమయంలోనే జాలర్లకు చిక్కుతాయి. ఈ పులసకు ఎందుకింత క్రేజు అంటే చేప రుచికన్నా పులుసు రుచి కోసమే పులసప్రియులు ఎగబడతారు. ఇప్పుడు వాటి అడ్రస్ గల్లంతైంది. దాదాపుగా ఇటువైపు రావడం మానేశాయి. ఎందుకు ఇలా మోహం చాటేశాయి...? ఏంటి కథ..?!





(మండపేట- ఆంధ్రజ్యోతి)

ఏటా గోదావరికి వరదలు వచ్చే సమయంలో పులసల జాడ మొదలవుతుంది. సుమారుగా జూలై, ఆగస్టులో రెండు నెలలు ఈ రకం చేపలు దొరకడం జరిగేది. దీన్నే పులసల సీజన్‌గా పరిగణించేవారు. కానీ ఈసారి నుంచి గోదావరికి వరదనీటి తాకిడి అక్టోబరు వరకు కొనసాగడంతో సీజన్ ఇప్పటిదాకా కొనసాగింది. అఖండ గోదావరిలోకి ఎర్రనీరు ముంచెత్తినప్పుడు ఈ అధిక జలాలను ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు సముద్రంలోకి విడిచిపెడతారు. సముద్రంలోకి ఈ గోదావరి తీపినీరు కలిసే సమ యంలో అక్కడున్న విలస చేపలు గోదావరిలోకి ఎదురీదుతూ వస్తాయి. అలా ఉప్పునీటి నుంచి మంచినీటిలోకి ప్రవేశించడంతో అవి పులసలుగా మారిపోతాయి. రుచికరమైన చేపలుగా మారడానికి కారణం ఉప్పునీటి నుంచి తీపి నీటిలోకి రావడమే. రోజులు గడుస్తున్న కొద్దీ వీటి శరీరం మార్పు చెందుతూ ఉంటుంది. ఈ చేపలు ఎక్కువగా గోదావరిలో గుడ్లను పెట్టేందుకే వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతారు. చేప బరువును బట్టి వాటి సంతానోత్పత్తి జరుగుతుంది. కిలో బరువు ఉన్న ఆడ చేప లక్ష గుడ్లను, రెండు కిలో లు ఉండే చేప రెండు లక్షలను పెడుతుంది. సముద్రం నుంచి ధవళేశ్వరం వరకు పులస వలస వెళ్లే సమయంలోనే మత్స్యకారులు గోదావరిలో పులసలు వేట సాగిస్తుంటారు. అది కూడా పులసల వేట కోసం ప్రత్యేకంగా తయారుచేసిన సిల్క్ వలలను మాత్రమే వాడతారు. ఆడచేప సెనతో ఉండడంతో చాలా రుచితోపాటు పులుసు అద్భుతంగా రావడానికి అదే కారణం. కానీ పోతు చేపలకు అంత రుచి రాదు. కానీ మార్కెట్‌లో అన్నీ ఒకటే రకం చేపలుగా విక్రయించేస్తున్నారు. ఈ ఏడాది సీజన్ ముగుస్తున్నప్పటికీ ఇప్పటి దాకా గోదావరిలో దొరికిన పులసలు వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయిలోనే లభ్యమయ్యాయి. దాంతో ఎక్కడైనా చేప దొరికిందంటే కొనుగోలుదారులు వాలిపోతున్నాయి. పాట పెడితే వేలల్లో పాడుకుని సొంతం చేసుకుని ఇతర ప్రాంతాలకు పంపేస్తున్నారు. కానీ స్థానికంగా పులసలు తినే అవ కాశం మాత్రం ఎవరికీ లభించడం లేదు. నిజానికి పులసల సీజన్ వస్తే మత్స్యకారులకు కూడా పంట పండినట్టు ఉండేది. ఎంత వెదికినా వాటి జాడలేకపోవడంతో వారు కూడా నిరాశ చెందుతున్నారు. గోదావరిలోను, అటు సముద్రంలోను కలుషిత జలాల వల్ల పులసలు రావడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సాధారణంగా గోదావరిలో పులసల వేట ఇటు ధవళేశ్వరం నుంచి అటు కోనసీమ, యానాం నదీ పరీవాహక ప్రాంతాల వరకు సాగుతుంది. ఇక్కడ లభ్యం అయ్యే పులసలకు మంచి డిమాండ్ ఉంటుంది. రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. కానీ వాటి జాడలేకపోవడంతో పులస రుచి కూడా గత చరిత్రలానే మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. పూర్వం పులసలు జూలై, ఆగస్టు మాసాల్లో మాత్రమే దొరికేవి. ఏటా ఐదు నుంచి ఆరు కోట్ల రూపాయల మేరక వ్యాపారం జరిగేదని చెబుతారు. ఇప్పుడు వరదలు నిన్న మొన్నటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే గోదావరికి వరద నీటి తాకిడి తగులుతూనే ఉంది. దాంతో మూడు నెలలపాటు పులసల వేట సాగించారు. అక్కడక్కడ కిలో, కిలోన్నర చేపలు దొరికాయి. లేదంటే అర కిలో చేపలు ఇప్పటిదాకా దొరుకుతూ వచ్చాయని మత్స్యకారులు తెలిపారు.

ఒడిసా విలసలే చెలామణీ

పులసల జాడ తగ్గిపోయినా, వాటి రుచి చూడాలనే వారి సంఖ్య పెరిగింది. గతంలో ధవళేశ్వరం, ఆత్రేయపురం, బొబ్బర్లంక, కోటిపల్లి, కపిలేశ్వరపురం, పొట్టిలంక తదితర ప్రాంతాల్లో దొరికే పులసలకు మంచి డిమాండ్ ఉండి. తెల్లారేసరికి ఈ చేపల కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలుదారులు వాలిపోయేవారు. ఇప్పుడు ఆయా మార్కెట్లలో పులసలు రావడం లేదు. దాంతో ఒడిసాలో విరివిగా దొరికే విలసలను ఇక్కడకు తెచ్చి పులసల పేరుతో విక్రయిస్తున్నారు. ఈ మార్కెట్లలో మాత్రం ఈ రకం చేపలు అమ్మితే మత్స్యకార సంఘం తరఫున పెనాల్టీలు వేస్తారు. దాంతో సమీపంలోనే ఇతర ప్రాంతాల్లో, ధవళేశ్వరం, యానాం ప్రాంతాల్లో ఒడిసా విలసలు విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులైతే వాటిని విలసలుగానే చెప్పి మరీ విక్రయిస్తున్నారు. ధర కూడా రూ.500 నుంచి రూ.1550లోపే సైజును బట్టి దొరుకుతుండడంతో ఏదొకలే అని వాటినే జనం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు వాటి సరఫరా కూడా తగ్గిపోవడంతో మార్కెట్‌లో సీజన్ ముగిసినట్టేనని భావిస్తున్నారు.

చీరమేనుదీ అదే పరిస్థితి..

గోదావరిలో చీరమేను అనే చిరుచేపల సీజన్ నడుస్తోంది. చీరమేను ఆశ్వయుజ మాసంలోనే దొరుకుతుంది. గోదావరి తీరంలో లభ్యమయ్యే ఈ సీరమేనును మత్స్యకారులు గోదావరిలోకి వెళ్లి చీరలతో వేటాడి బిందుల్లో వేసి మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తారు. శేరులు లెక్కన వీటిని విక్రయిస్తారు. ప్రస్తుతం వీటి ధర అధికంగానే ఉంది. దీపావళి వరకు మాత్రమే చీరమేను లభ్యమవుతుందని మత్స్యకారులు తెలిపారు. యానాం, ఎదుర్లంక, కోటిపల్లి ప్రాంతాల్లో చీరమేను వేట ఎక్కువగా సాగుతుంది. గోదావరి ఒక తెల్లటి తెట్టులాగా కనిపించగానే వేటాడతారు. ఇవి కూడా గోదావరిలో ఎదురీదుకుంటూ ధవళేశ్వరం చేరుకునేసరికి చీరమేను కాస్తా ఇసుక దొందులుగా రూపాంతరం చెందుతుందని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇవి దొరకడం కూడా గగనమైపోయిందని వారు వాపోతున్నారు.







చింతూరులో కిక్కాల్ కుసీర్‌ని విక్రయిస్తున్న ఆదివాసీ మహిళ

కిక్కాల్ కుసీర్

ఆ రుచే వేరబ్బ..!

(పచ్చకూర)

చింతూరు, అక్టోబరు 18: కిక్కాల్ కుసీర్ .. చింతూరు ఏజెన్సీలో ఆదివాసీలతోపాటు ఆదివాసేతరులు సైతం ఎంతో ఇష్టంగా తినే ఓ ఆకు కూర ఇది. కుసీర్ అనేది ఆదివాసీ పదం. దీని అర్థం కూర అని. కిక్కాల్ అనేది ఆ ఆకుకూర పేరు. ఇక్కడ జూన్ నుంచి అక్టోబరు వరకు ఈ కూర లభ్యమవుతుంది. బీడు పొలాల్లోనూ, జొన్న, నువ్వు, మినుము, పెసర లాంటి మెట్ట పంట పొలాల్లో ఇది లభ్యమవుతుంది. సహజసిద్ధంగా ఇది మొలుస్తుంది. నాలుగు నుంచి ఎనిమిది ఆకులు వచ్చేంత వరకు వేచి చూసి తర్వాత తెంపుకొని ఈ ప్రాంత వాసులు వండుకొని తింటారు. సహజసిద్ధంగా లభ్యమయ్యే ఈ ఆకుకూరను ఆదివాసీ మహిళలు ఉదయాన్నే తెంపుకొని మార్కెట్‌కు తీసుకొస్తుంటారు. పోగులుగా (కుప్పలుగా) పోసి ఒక్కో పోగును రూ.20కు విక్రయిస్తుంటారు. ఈ కూరను ఇష్టపడేవారంతా పోటీపడి మరీ కొనుగోలు చేయడం పరిపాటి.

● వంటకం ఇలా..

ఒక పాత్రలో తగినంత వంట నూనె వేడి చేసి అందులో వెల్లుల్లిపాయలు, ఎండిమిర్చి, ఉల్లిపాయలు, తాలింపు సామగ్రిని కలిపి వేపుతారు. కొద్దినిమిషాల వ్యవధిలో కడిగి ఆరబెట్టిన ఆకును ఆ తాలింపులో వేసి వంటపాత్ర మూత పెట్టేస్తారు. సుమారు 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో కూర రెడీ అవుతుంది. ఎక్కడ చూసినా వివిధ రకాల ఫెర్టిలైజర్లు, కాంప్లెక్స్ ఎరువులను ఉపయోగించి పంటలను సాగుచేస్తున్న విషయం విదితమే. ఇది మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెల్సినా తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో సహజ సిద్ధంగా లభ్యమయ్యే ఇటువంటి ఆకుకూరలను తీసుకోవడం ఎంతో మేలన్న భావన ఉంది.





రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలను క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ... క్రీడల పోటీలు

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలి

- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- ఉత్సాహంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు
- వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరు


కాకినాడ అర్బన్, అక్టోబరు 18: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కాకినాడ వివేకానంద పార్కులోని వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌లో 68వ అంతర్ జిల్లాల స్కేటింగ్ పోటీలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. పాఠశాల విద్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు అండర్-11, 14, 17 విభాగాల్లో పాల్గొంటున్నారు. ముందుగా కలెక్టర్ జాతీయజెండా ఆవిష్కరించగా క్రీడా పతాకాన్ని డీఈవో రమేష్, డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే క్రీడా జ్యోతిని వెలిగించారు. రూరల్ ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రానున్నరోజుల్లో కాకినాడలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించాలన్నారు. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి జార్జి, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కోశాధికారి రమేష్ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు వి.రవి రాజు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

కాకినాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు శుక్రవారం రాత్రి వరకు ఉత్సాహంగా సాగాయి. మొదటిరోజు 500 మీటర్లు ప్లస్‌డీ విభాగంలో విజేతలను ప్రకటించారు. అండర్-11 బాలికల విభాగంలో.. బాలికల్లో.. గుంటూరుకు చెందిన టి.నాగదుర్గ బంగారం, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మోసా అనికసుశాన్ రజతం, ఆకుల కావ్యశ్రీ కాంస్యం పతకాలు సాధించారు. బాలురలో.. తూర్పుగోదావరికి చెందిన విరోధి రిషేశ్వర్ బంగారం, కోనల వర్షిత్ రజతం సాధించగా విశాఖకు చెందిన కరణం జైచందన్ కాంస్యం పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అండర్-14 విభాగంలో.. బాలికల్లో.. నెల్లూరుకు చెందిన అద్విక రమ్య బంగారు పతకం సాధించగా కృష్ణా జిల్లాకు చెందిన టి.తనూజసాయి రజతం, తూర్పుగోదావరికి చెందిన ఉంగరాల హర్షిక కాంస్యం పతకాలు సాధించారు. బాలుర విభాగంలో.. తూర్పుగోదావరికి చెందిన నెల్లూరు నిఖిల్ ఈశ్వర్ బంగారం, కట్టా గగన్ రజతం, కృష్ణాకు చెందిన కె.విఘ్నేష్ కాంస్యం సాధించారు. అండర్-17 విభాగం.. బాలికల్లో తూర్పుగోదావరికి చెందిన వి.వీరవర్షిణి బంగారం, విశాఖకు చెందిన విద్యా ప్రణతి రజతం, నెల్లూరుకు చెందిన ఎస్.జాస్మిత కాంస్యం సాధించారు. బాలుర విభాగంలో.. విశాఖకు చెందిన పి.జాన్సన్ బంగారం, అంబుజూరి లోహిత్‌సాయి రజతం సాధించగా తూర్పుగోదావరికి చెందిన కోట లిఖిత్ కాంస్య పతకం సాధించాడు. అండర్-19 విభాగంలో మహిళల్లో.. చిత్తూరుకు చెందిన కె.స్నేహకృతి బంగారం, కృష్ణాకు చెందిన వి.జాహ్నవి రజతం, పశ్చిమగోదావరికి చెందిన మౌనిక దివ్య కాంస్య పతకాలు సాధించారు. పురుషుల్లో.. చిత్తూరుకు చెందిన కె.శ్రీవింధ్యన్ బంగారం, కృష్ణాకు చెందిన జశ్వంత్ రజతం, తూర్పుగోదావరికి చెందిన కుసుమ అర్జున్ కాంస్యం సాధించారు. వీరిలో కొంతమందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు.

ఆశ.. నిరాశ..!

పోటీల్లో పాల్గొనకుండానే గాయపడ్డ విద్యార్థిని



కాకినాడఅర్బన్, అక్టోబరు 18: ఒక్కోసారి మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా అనుకోకుండా కొన్ని సంఘటనలు జరుగుతాయి. స్కేటింగ్‌లో పాల్గొని రాణించాలని జిల్లాలు దాటి కాకినాడ వచ్చిన విద్యార్థిని ప్రాక్టీసు చేస్తున్న సమయంలో జారి పడిపోవడంతో చేతికి గాయమైంది. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఏడో తరగతి విద్యార్థిని పి.హైందవి శుక్రవారం కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొనడానికి తోటి విద్యార్థులతో కలిసి వచ్చింది. సాయంత్రం పోటీల్లో పాల్గొనడానికి రింక్‌లో సాధన చేస్తుండగా జారిపడిపోయింది. దీంతో ఆమె ఎడమ చేతికి గాయమైంది. ఎన్నో ఆశలతో పోటీల్లో పాల్గొనాలని వచ్చిన హైందవి ఆశ నిరాశైంది. ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు.





కత్తులవారిపేటలో మహేష్‌బాబు ఫ్యాన్స్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ.. మహేష్‌బాబు ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్ చేయించుకున్న చిన్నారితో తల్లిదండ్రులు

చిన్నారి గుండె ఆపరేషన్‌కు మహేష్‌బాబు సాయం

పి.గన్నవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నువ్వు కాపాడిన 3772వ ప్రాణం స్వామి, నువ్వే మా దేవుడని నువ్వు నమ్మే పనిలేదు. మాకు నమ్మించే అక్కరలేదు.. సామీ.. ఇది నిదర్శనం ఇది నిదర్శనం... అంటూ మహేష్ బాబు సినిమాలో ఓ డైలాగ్‌తో ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు పి.గన్నవరం శివారు కత్తులవారిపేట సూపర్‌స్టార్ ఫ్యాన్స్ కత్తులవారిపేటకు చెందిన రెండేళ్ల చిన్నారి రిత్వికకు గుండెకు రంధ్రం పడిందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు నాగాబత్తుల తాతాజీ, జ్యోతి దంపతులు ఆందోళన చెందారు. మహేష్‌బాబు ఫౌండేషన్‌ను ఆశ్రయించగా, సెప్టెంబరు 16న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ జరిగింది. దీంతో గ్రామస్తులు ఇటీవల మహేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీ పెట్టారు.

21న కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న కాకినాడలోని వికాస కార్యాలయం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో జూనియర్ అకౌంటెంట్, ఆఫీసు అకౌంటెంట్, ఫైనాన్సియల్ అడ్వయిజర్, టెక్నీషియన్, టెలీకాలర్, టెలీసేల్స్ రిప్రజెంటేటివ్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 7799376111లో సంప్రదించాలని లచ్చారావు ఒక ప్రకటనలో కోరారు.



క్యూ లైన్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఏఈఈ రామకృష్ణ, డీఈఈ రాంబాబు

అదనపు క్యూ లైన్ల ఏర్పాటుకు చర్యలు

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న ప్రారంభమయ్యే కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సత్యదేవుని సన్నిధికి అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టిసారించారు. ఇందులో భాగంగా శుక్రవారం అదనపు క్యూలైన్లకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. రూ.300 వ్రతం చేయించుకునే భక్తులు, సాధారణ దర్శనం చేసుకునేవారికి స్వామివారి పవళింపు సేవ మందిరం ప్రాంతంలో మరో రెండు అదనపు క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అక్కడ ఫ్లోరింగ్ కిందకు ఉండడంతో ఎత్తు చేయించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ సూచించారు. కార్యక్రమంలో డీఈఈ రాంబాబు పాల్గొన్నారు.

337 గ్రాముల వెండి శంఖం

సత్యదేవునికి బహూకరణ



అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి తెలంగాణ రాష్ట్రం కోదాడకు చెందిన బొడ్ల వెంకట రామనరసయ్య 337 గ్రాముల వెండితో శంఖం చేయించారు. శుక్రవారం దానిని ఆలయ అధికారి కంచిబొట్ల రాంబాబుకు అందించారు. దాతను ఆయన అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి

సభ్యత్వ నమోదులో నాలుగో స్థానంలో 'తూర్పు'

రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిన వైసీపీ ప్రభుత్వం

బీజేపీ సభ్యత్వాలపై సమీక్షలో రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. శుక్రవారం ఆమె తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వాల నమోదులో తూర్పు గోదావరి జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో ఉందని... కార్యకర్తల కష్టం, వారి కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు. ఆర్థికంగా కుదేలైన రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకోవడానికి కేంద్రం తన వంతు సహకారం అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా సెంట్రల్ ట్యాక్స్ వసూళ్లలో రాష్ట్ర వాటా 42 శాతంలో రెండు నెలలకు కలిపి 7,800 కోట్లు అందించిందన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి కేంద్రం రాష్ట్రానికి 4 వేల కోట్లకు పైగా నిధులు ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు ఇటీవల పల్లెల్లో రోడ్ల మరమ్మతులకు రూ.700 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారని, కేంద్రం తోడ్పాటుతోనే ఇది సాధ్యమైందన్నారు. వీటితో పాటు అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12,500 కోట్లు కేటాయించిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పోలవరం ఆగిపోయిందని, డయాఫ్రం వాల్ కూడా దెబ్బతిందన్నారు. దీంతో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడమే కాకుండా దెబ్బతిన్న డయాఫ్రంవాల్ నిర్మాణం కోసం మరో రూ.900 కోట్లు ఇస్తామని కేంద్రం చెప్పిందన్నారు. విశాఖ రైల్వే జోన్ నిర్మాణం త్వరలోనే జరుగుతుందని, ఎయిర్‌పోర్టు విస్తరణ, రాజమహేంద్రవరం ఈస్ట్ రైల్వే స్టేషన్ అభివృద్ధి, అనపర్తి కెనాల్ రోడ్డును నేషనల్ హైవేగా డిక్లేర్ చేయించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తారనే మాట కాకుండా దాన్ని లాభాల్లోకి ఎలా తీసుకురావాలనే దానిపై కేంద్రం దృష్టిపెట్టిందన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో సభ్యత్వాలు ఇప్పటికే లక్షకు పైగా దాటాయని.. నమోదుకు ఇంకా సమయం ఉన్నందున సభ్యత్వాలు పెరిగేలా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 17 లక్షలకు పైగా సభ్యత్వాలు నమోదయ్యాయని, తెలంగాణ కంటే ఏపీలోనే సభ్యత్వాల నమోదు బాగుందన్నారు. దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా సభ్యత్వాల నమోదు లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. సమావేశంలో అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, హారిక, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణారావు, ఎనుముల రంగారావు తదితరులు పాల్గొన్నారు.



ఏకే మల్లవరంలో వివాదానికి దిగిన ఇరువర్గాల ప్రజలు

ఏకే మల్లవరంలో ఇరు వర్గాల మధ్య వివాదం

ఉద్రిక్తత, పోలీసుల మోహరింపు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఏకే మల్లవరంలో చర్చి పాస్టర్ భార్య చనిపోతే అక్కడే ఖననం చేయడం, చర్చి బయట వినాయకుడి ఫ్లెక్సీ ఏర్పాటు, తొలగింపు, ప్రజలు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలను తీసివేయడం వంటి ఘటనలు ఉద్రిక్తతలకు దారితీశాయి. దీనిపై కలిదిండి వీరబాబు, అన్నవరపు వీరబాబు, రాజమహేంద్రవరపు చంటి తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలు వివాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ అక్కడకు చేరుకుని పరిస్థితిని అంచనా వేశారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదుచేసుకోవడంతో పాటు వాదనలకు దిగడంతో సుమారు ఆరు గంటల పాటు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన ఏర్పడింది. బల్లలు ఏర్పాటు



శాంతి కమిటీ ఏర్పాటుపై చర్చిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ

చేసేందుకు చర్చి నిర్వాహకులు అంగీకరించలేదు. వాటిపై కూర్చున్న వారు మహిళలను ఏడిపిస్తున్నారంటూ సిమెంటు బెంచీల ఏర్పాటును అడ్డుకున్నారు. ఇరువర్గాలతో చర్చించి అక్కడ బెంచీలు ఏర్పాటు చేశారు. ఇరువర్గాలు సంయమనంతో ఉండాలని సూచించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఇరువర్గాలతో తహసీల్దారు, ఎస్ఐలు చర్చలు జరిపి శాంతి కమిటీని ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

స్థలం అమ్మకం

అమలాపురం పేరూరు Y జంక్షన్‌లో అల్లవరం రోడ్డులో ఐదున్నర సెంట్లు స్థలం అమ్మకానికి కలదు. కావలసినవారు సెల్: 98495 66647, 77020 97293 సంప్రదించగలరు. AJD:

WANTED

రెడ్డీస్ కంపెనీ నందు పనిచేయుటకు సూపర్‌వైజర్స్, మరియు హెల్పర్స్, ఆడ/మగ వారు కావలెను. విశాఖపట్నం, హైదరాబాద్. జీతం : సూపర్‌వైజర్‌కు రూ.25,000/-, హెల్పర్‌కు రూ.19,000/-. వసతి, భోజనం కలదు. సంప్ర. 6309895378. AJV_204709

VEHICLE FOR SALE

AP-31-CA-5666 HYUNDAI VERNA 1.6 Model 2012, వాహనములు ది. 24-10-24న ఉదయం 10-30ని.లకు అమ్మబడును. వివరములకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్ ✆ 99639 97127, 99490 23859 AJB - 823

కావలెను

రాజమండ్రి మరియు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు మెడికల్ రిప్స్ F/M కావలెను మరియు కంప్యూటర్ అనుభవం గల స్టాఫ్ కావలెను. మంచి జీత భత్యములు ఇవ్వబడును. ఇ.సం. సెల్: 9494915678, 96666 65352

జీజీయూలో జనవరి 8 నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు

రాజానగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా ఔన్నత్యాన్ని దశదిశలా మరింత చాటిచెప్పేలా ప్రపంచ తెలుగు మహాసభలను 2025 జనవరి 8, 9, 10 తేదీల్లో జీజీయూ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జీజీయూ ఏర్పాటుచేసిన సమావేశంలో ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ పూర్తి బాధ్యతలను చైతన్య సంస్థలే చేపడుతున్నట్లు చెప్పారు. దీనికి ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, హైకోర్టు న్యాయమూర్తులు, సినీ తారలు, కేంద్ర మంత్రులు హాజరవుతారన్నారు. ప్రాంగణంలో నన్నయ్య భట్టారక వేదిక, రాజరాజనరేంద్ర వేదిక, కందుకూరి వీరేశలింగం అనే పేర్లతో మూడు ప్రధాన వేదికలు ఏర్పాటు చేస్తామన్నారు. పలువురు ప్రముఖులకు సంక్రాంతి, విశిష్ట పురస్కారాలు అందజేస్తామని సత్యనారాయణరాజు చెప్పారు. పద్య పఠనం, గద్య పఠనం, అవధానాలు జరుగుతాయన్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ, పాటల సాహిత్య ప్రసిద్ధ రచయిత అనంత్‌శ్రీరామ్, కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. సమావేశంలో జీజీయూ ఉప కులపతి యు.చంద్రశేఖర్, సాహిత్యవేత్తలు విశ్వనాథ గోపాలకృష్ణ, యర్రాప్రగడ రామకృష్ణ, సప్పా దుర్గాప్రసాద్, పీవీబీ సంజీవరావు, విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకిలీ రసీదు వ్యవహారంపై ఫిర్యాదు

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో భక్తుడికి సత్రం గది కేటాయింపునకు సంబంధించి నకిలీ రసీదు అందించిన వ్యవహారంపై శుక్రవారం సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరి పేర్లు ప్రస్తావించకుండా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక కాంట్రాక్టు ఉద్యోగి, ఒక రెగ్యులర్ ఉద్యోగి పాత్ర ఉన్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.

సత్య దీక్షకు వేళాయె...

- ఈ నెల 27న ప్రారంభం
- నవంబరు 6న 8 రోజుల దీక్ష
- 14న తొమ్మిది రోజుల దీక్ష
- 23న ఇరుముడి సమర్పణ

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా పూజలందుకుంటున్న సత్యదేవుని దర్శనం చేసుకుంటేనే ఎంతో పుణ్యఫలంగా భక్తులు విశ్వసిస్తారు. అటువంటిది ఎంతో నియమ, నిష్ఠలతో 27 రోజుల పాటు సత్యదీక్ష చేపడితే మరింత పుణ్యఫలం లభిస్తుందని ప్రగాఢ విశ్వాసం. అయ్యప్ప, భవానీ దీక్షల మాదిరిగా అన్నవరం సత్యదేవుని దీక్ష బహుళ ప్రాచుర్యం పొందింది. ఆశ్వయుజ మాసంలో మఖ నక్షత్రం రోజున ప్రారంభమయ్యే సత్యదీక్ష కార్తీక మాసంలో మఖ నక్షత్రం రోజున ఇరుముడి సమర్పణతో ముగుస్తుంది. ఈ ఏడాది సత్యదీక్షలు అక్టోబరు 27న ప్రారంభమవుతాయి. మొదట్లో 27 రోజుల దీక్షను ప్రవేశపెట్టగా కాలక్రమంలో మహిళలను దృష్టిలో ఉంచుకుని 18 రోజులు, 9 రోజులు అమలు చేశారు. సత్యదీక్ష ఎప్పుడు తీసుకున్నా ఇరుముడి సమర్పణతో కార్తీక మాసంలో మఖ నక్షత్రం రోజునే ముగుస్తుంది.

27 రోజుల దీక్ష అక్టోబరు 27న, 18 రోజుల దీక్ష నవంబరు 6న, తొమ్మిది రోజుల దీక్ష నవంబరు 14న ప్రారంభమవుతాయి. నవంబరు 23న విరమించాలి. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా గిరిజనులతో దీక్ష ఇస్తున్నారు. వారికి దేవస్థానం తరఫున దీక్షా వస్త్రాలు, మాలలు ఉచితంగా అందిస్తారు. ఈ ఏడాది 600 మంది గిరిజనులకు దీక్షా వస్త్రాలు ఇచ్చారు.

నియమావళి

- సత్యదీక్షాపరులు పసుపు రంగు వస్త్రాలు ధరించాలి.



తెల్లవారుజామున లేచి సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయానికిముందు చన్నీటితో శిర స్నానము చేయాలి.

- దీక్షాకాలంలో ప్రతి ఒక్కరినీ సత్యదేవ స్వరూపులుగా భావించి మగవారిని సత్యదేవ, ఆడవారిని సత్యా సంబోధించాలి. తల్లిదండ్రులు, గురువులను, పెద్దలను గౌరవించి సేవించాలి.
- దీక్షాకాలం ఎల్లవేళలా విభూతి, కుంకుమ బొట్టు ధరించి సత్యదేవాయ నమః అంటూ స్మరించాలి. మాలలు ఎట్టి పరిస్థితుల్లో నేలకు తాకకుండా చూసుకోవాలి. ఒకపూట ఆహారం భుజించి రెండవపూట అల్పాహారం తీసుకోవాలి. మాంసాహారం, ఉల్లి, ఎటువంటి మసాల దినుసులు ఉపయోగించని ఆహారమే భుజించాలి.
- పూజ, భిక్ష, భజన సమయాల్లో చొక్కాలు ధరించరాదు.

త్రికరణ శుద్ధిగా బ్రహ్మచర్యం పాటించి నేలపై కొత్త చాప, కొత్త దుప్పటి వేసుకుని విశ్రమించాలి.

- పాదరక్షలు ధరించడం, పొగ తాగడం, కిళ్లీలు నమలడం వంటివి మానుకోవాలి. క్షవరం చేయించుకోవడం, మద్యం సేవించడం, జూదం ఆడడం వంటి చేయకూడదు. బహిష్టు అయిన మహిళలను చూసినా, శవమును చూసినా వెంటనే స్నానమాచరించి ఇంటికి చేరుకోవాలి. సత్యమునే పలుకుతూ గురుస్వాముల మాటలను మిక్కిలి ఆజ్ఞగా భావించాలి.
- దీక్షలను వారి స్వగ్రామాల్లోని ఆలయాల్లో స్వీకరించినా సత్యదేవుని సన్నిధిలో ఇరుముడి సమర్పణతోనే విరమించాలి.



గిరిజనులకు దీక్షావస్త్రాలను ఉచితంగా అందజేస్తున్న అన్నవరం దేవస్థానం అధికారి

దేశకీర్తిని ఇనుమడింపజేస్తా

అండర్-17 స్విమ్మింగ్ భారత జట్టు సభ్యుడు మణికంఠ... ఈజిప్ట్ ఈత పోటీల్లో భారత్‌కు కాంస్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠ నవీన్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 18: భారతదేశ కీర్తిని ఇనుమడింపజేస్తానని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన స్విమ్మింగ్ క్రీడాకారుడు మణికంఠనవీన్ పేర్కొన్నాడు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మణికంఠ మాట్లాడుతూ ఇటీవల ఈజిప్ట్ దేశంలో జరిగిన అండర్-17 స్విమ్మింగ్ పోటీల్లో భారత జట్టు కాంస్య పతకం సాధించిందని, ఆ జట్టులో తాను సభ్యుడిగా ఉన్నానన్నారు. తాను ఈజిప్ట్ వెళ్లి పోటీల్లో పాల్గొనేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపాడు. కోచ్ గ్రంధి రవితేజ్ ఇచ్చిన సూచనలు, సలహాలు ఎంతో తోడ్పడ్డాయన్నాడు. త్వరలో జరిగే ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనాలనేది తన కోరిక అని.. రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తే మరింత కష్టపడి పతకం సాధించేందుకు కృషి చేస్తానని మణికంఠ చెప్పాడు. విలేకరుల సమావేశంలో నవీన్ తండ్రి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం లోపభూయిష్టం

- బీజేపీ సహా అన్ని పార్టీలకు ముడుపులు ఇచ్చిన 'మెగా' సంస్థ
- సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి
- అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 18: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం లోపభూయిష్టంగా జరుగుతోందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, వైసీపీలకు మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ కోట్లాది రూపాయల ముడుపులు ఇచ్చిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఎన్నో ఆరోపణలున్నా ఎంఈఐఎల్ కంపెనీకే ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను తిరిగి అప్పగించడాన్ని తప్పుబట్టారు. డయాఫ్రం వాల్ నిర్మాణంలో జరిగిన లోపాల వల్ల వాల్ కొట్టుకుపోయిందని కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అయ్యిందన్నారు. దీనికి



ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. సంబంధిత ఇంజనీర్లు, ముఖ్యమంత్రులను బాధ్యులుగా చేస్తారా అని నిలదీశారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని పోలవరం ప్రాజెక్టు డీపీఆర్‌ను పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ప్రాజెక్టు టెండర్లు పిలవాలని, డబుల్ డయాఫ్రంవాల్ నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారం పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రికి లేఖ రాస్తున్నానన్నారు. తాను ఏ రాజకీయ పార్టీకీ చెందినవాడను కాదని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పారదర్శకంగా జరిగే వరకు పోరాడతానని హర్షకుమార్ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

ఆధునిక సాంకేతిక అంశాలపై వృత్తిపరమైన అవగాహన పొందాలి

జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, అక్టోబరు 18: కాకినాడ జేఎన్టీయూ యూసీఈకే సీఎస్ఈ విభాగంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఏఐ, ఎంఎల్ ఆధ్వర్యంలో 'ఇండస్ట్రీ 4.0' అంశంపై రెండు రోజుల పాటు జరిగే ఎఫ్‌డీపీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు పాల్గొన్నారు. వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం ఆదరణలో ఉన్న ఏఐ, ఎంఎల్, ఐఓటీ, డేటా సైన్స్, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఏఆర్, వీఆర్ కోర్సులు పరిశ్రమలకు అనుగుణంగా అధ్యాపకులు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ల ద్వారా ఆధునిక సాంకేతిక అంశాలపై వృత్తిపరమైన అవగాహన పొందాలన్నారు. సీఎం చంద్రబాబు ఇటీవల ప్రస్తావించిన ఇండస్ట్రీ రెడీ కోర్సులకు సంబంధించిన ఎఫ్‌డీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు సమన్వయకర్తలను అభినందించారు.

రిసోర్స్‌పర్సన్లుగా డాక్టర్ కేఎం కృష్ణ, డాక్టర్ వల్లభరావు వ్యవహరించగా యూసీఈకే ప్రిన్సిపాల్ మోహన్‌రావు, కరుణ, చక్రవర్తి, శివరామకృష్ణ, డీఈ పద్మజారాణి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అస్సాగో పరిశ్రమకు వ్యతిరేకంగా...


22 నుంచి సామూహిక నిరవధిక దీక్ష

కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి శివగణేష్

గోకవరం, అక్టోబరు 18: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ ఆల్కహాల్ జల, వాయు, శబ్ధ కాలుష్య కారక పరిశ్రమ నిర్వహణకు వ్యతిరేకంగా గ్రామంలో ఈ నెల 22న తాను సామూహిక నిరవధిక దీక్ష చేపట్టనున్నట్టు కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా గ్రామాలను ఆన్ని, జనావాసాల మధ్యలో ఇథనాల్ పరిశ్రమ నిర్మించారన్నారు. నిర్వహణ ప్రారంభం నుంచీ పిల్లలు, వృద్ధులు, గర్భిణులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని ఆవేదన చెందారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, 20 రోజుల్లో ఈ వ్యవహారాన్ని చక్కబెడతామని యాజమాన్యం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కోరిన గడువు పూర్తయినప్పటికీ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారన్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమను మూసేయాలని కోరుతూ ఈ నెల 22న దీక్ష చేపట్టనున్నట్టు శివగణేష్ చెప్పారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి

ఇంట్లో రిఫ్రిజిరేటర్ రిపేర్ చేస్తుండగా ఒకరు...



నాగవెంకటశేషాద్రి (పాత చిత్రం)

ముమ్మిడివరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంకలో విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఠాణేలంకకు చెందిన టీడీపీ నాయకుడు సుందరపల్లి నాగ వెంకటశేషాద్రి (50) తన ఇంట్లో రిఫ్రిజిరేటర్‌కు మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అతడిని ముమ్మిడివరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మోటారు సైకిల్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్న శేషాద్రికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి ఆకస్మిక మృతితో జీవనాధారం కోల్పోయామని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్తారింట్లో రిఫ్రిజిరేటర్ శుభ్రం చేస్తుండగా మరొకరు...



నాగరాజు (పాత చిత్రం)

ఉప్పలగుప్తం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అత్తారింటికి వచ్చిన అల్లుడు మృత్యువాతపడడంతో వాసాలతిప్పలో విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంకకు చెందిన కొప్పాడి నాగరాజు (29) రెండు రోజుల క్రితం ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్పలోని అత్తవారి ఇంటికి వచ్చాడు. గురువారం సాయంత్రం ఇంట్లో రిఫ్రిజిరేటర్ శుభ్రం చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివాహమైన ఎనిమిదేళ్లకే భర్త మరణించడంతో భార్య జయలక్ష్మి విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చలమల రాజేష్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

పిఠాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడిని పిఠాపురం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలోని సత్తెమ్మతల్లి గుడి వద్ద మేడిశెట్టి రామకృష్ణ తన అన్నయ్య బాబ్జీతో ఈనెల 16వ తేదీ సాయంత్రం గొడవపడ్డాడు. అది చూసిన పసుపులేటి శ్రీనివాస్ వారిని అడ్డుకున్నాడు. తన అన్నకు మద్దతుగా వస్తున్నాడన్న కోపంతో శ్రీనివాస్‌పై కత్తితో దాడి చేయగా తప్పించుకున్నాడు. దీంతో శ్రీనివాస్ స్కూటీపై పెట్రోల్ పోసి దహనం చేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు పాల్పడిన రామకృష్ణను శుక్రవారం అతడిని ఇంటి వద్ద అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచనున్నారు.

కాకినాడ
• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రహదారులు ఛిద్రం

» భారీ గోతులతో ప్రమాదాలు.. కనీస మరమ్మతులు కరవు
» గుంతలతో వాహనదారులకు తప్పని అగచాట్లు

ప్రధాన రహదారులపై భారీగోతులు.. వర్షాలకు మరింత ఛిద్రమై గతుకులమయంగా మారి వాహన దారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు.



పిఠాపురంలో భారీ గోతులు

పిఠాపురం ఉప్పాడ సెంటర్ వద్ద రహదారిపై పడిన భారీ గోతులు

పిఠాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఇల్లింద్రాడ బైపాస్ జంక్షన్ నుంచి కోర్టులు, చర్చిసెంటర్, కోటగుమ్మం, ఉప్పాడ సెంటర్ మీదుగా పాతబస్టాండు, ప్రభుత్వాస్పత్రి సెంటర్ నుంచి ఆర్వోబీ వరకూ, ఉప్పాడ సెంటర్ నుంచి వన్‌వే రోడ్డు జంక్షన్, ఉప్పాడ రైల్వేగేటు, డ్రైవర్స్ కాలనీ మీదుగా ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి ఉంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. ఉప్పాడ సెంటర్ నుంచి రైల్వేగేటు వరకూ అక్కడినుంచి డ్రైవర్స్‌కాలనీ వరకూ రహదారిపై భారీ గోతులు పడ్డాయి. పలుచోట్ల రోడ్డు పైకిలేచిపోతోంది. పట్టణ శివారులోని బైపాస్‌జంక్షన్‌నుంచి కోర్టులు, పశువుల సంత వరకూ రహదారి అధ్వానంగా మారుతోంది. భారీవర్షాలతో రహదారులు మరింత ఛిద్రమయ్యాయి. భారీగోతులను పూడ్చి వర్షాలు తగ్గిన తర్వాత పూర్తిస్థాయిలో మరమ్మతులు చేరపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కాకినాడలో సిటీ ఎమ్మెల్యే ఇంటి ముందే ఈ పరిస్థితి

ఎమ్మెల్యే కొండబాబు ఇంటిముందు నీటమునిగిన రోడ్డు

కాకినాడ సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురం చర్చిస్క్వేర్ సెంటర్ సమీపంలోని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఇంటిముందు రోడ్డు పరిస్థితిది. దీంతో రోడ్డు పల్లంగా ఉండిపోయింది. వైసీపీ హయాంలో నిధులు మంజూరైనా అప్పటి పాలకులు రోడ్డు వేయనీయకపోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్డు మునిగిపోతోంది. దీంతో ఎమ్మెల్యే కొండబాబును కలవడానికి వచ్చే ప్రజలు నీటిలోనే రావాల్సి వస్తోంది. శుక్రవారం కురిసిన వర్షానికి ఎమ్మెల్యే ఇంటిముందు రోడ్డు ఇలా మునిగిపోయింది. ఆర్టీసీ బస్సులకు దారి మార్గంగా ఉన్న జగన్నాథపురం మున్సబు సెంటర్ నుంచి అన్నమ్మఘాటీ సెంటర్‌కు వెళ్లే రోడ్డు పెద్ద గోతులతో వాహనదారుల పాలిట శాపంగా మారింది.



తాళ్లరేవులో గుంతలతో ప్రయాణం నరకప్రాయం

సుంకరపాలెంలో గుంతలు పడిన రహదారి

తాళ్లరేవు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు తాళ్లరేవులో రహదారులు ధ్వంసమయ్యాయి. వాహనాలు గుంతల్లో పడి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు.సుంకరపాలెం-ద్రాక్షారామ రహదారి, తాళ్లరేవు మెయిన్‌రోడ్డు, పోలేకుర్రు వై.జంక్షన్ నుంచి యానాం రహదారి, పి.మల్లవరం-పత్తిగొంది, -నీలపల్లి రహదారి, తాళ్లరేవు చెరువుగట్టు సెంటరు నుంచి బాబానగర్ రహదారి, గుడ్డువానితూము సెంటరు నుంచి గాడిమొగ రహదార్లు పెద్దపెద్ద గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మార్గాల్లో ప్రయాణించాలంటేనే భయాందోళనలు నెలకొంటున్నాయని వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారులకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పల్లవి ప్రతిభ



పల్లవి

పెద్దాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో మండల పరిధిలోని ఆర్‌బీ పట్నం గ్రామానికి చెందిన మన్యం పల్లవి ప్రతిభ కనబరిచింది. ఈనెల 17,18 తేదీల్లో గుంటూరు బీఆర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ 10 రెండు విభాగాల్లో (ఫ్లోర్, బీమ్) ద్వితీయ స్థానం పొందింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో కోచ్ సురేష్ పర్యవేక్షణలో ఆరేళ్లుగా పల్లవి జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతోంది. ఈ సందర్భంగా పల్లవిని గ్రామస్థులు, ప్రముఖులు అభినందించారు.

సామర్లకోటలో 'స్నేహహస్తం'

సామర్లకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ సీనియర్ పర్సనల్ అధికారి కట్టా శ్రీఆనంద్ ఆధ్వర్యంలో శుక్రవారం స్నేహహస్తం కార్యక్రమాన్ని సామర్లకోట రైల్వే కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. రైల్వే ఉద్యోగులు, పెన్షనర్ల ఫిర్యాదులను పని ప్రదేశంలో పరిష్కరించడం ఈ శిబిరం ముఖ్యోద్దేశ్యమని సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. హెచ్‌ఆర్ఎంఎస్, ఎన్పీఎస్, యూఎంఐడీకి సంబంధించి 120 ఫిర్యాదులు పరిష్కరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజనీరు టి. సాంబశివరావు, ఆర్.వరహాలబాబు, డి.దీనదయాళ్, కె. సునీల్‌కుమార్, కె.శేషగిరిరావు, జీ. ప్రభుకుమార్, బి.సతీష్‌గిరి, ఐ.ప్రేమ్‌కుమార్, కె.ఫణీంద్రనాథ్, సామర్లకోట బ్రాంచ్ ట్రేడ్ యూనియన్లు, సూపర్‌వైజర్లు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన గిరీష్‌వర్మ



పిఠాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ యువనేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తనయుడు గిరీష్‌వర్మ కలిశారు. విశాఖలో శుక్రవారం లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి నియోజకవర్గ పరిస్థితులు వివరించారు.

'వన్ టైమ్ ఎగ్జామ్‌ను ఉపసంహరించాలి'

కాకినాడ సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఫీల్డ్ సిబ్బందికి నిర్వహిస్తున్న వన్ టైమ్ ఎగ్జామ్‌ను ఉపసంహరించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.వీరభద్రరావు అన్నారు. కాకినాడలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని ఇన్సూరెన్స్ విధానాల్లోకి మార్పు చేసినందున ఫీల్డ్ సిబ్బందికి క్యాడర్ కల్పించాలన్నారు. ఈ ఫీల్డ్‌లో పనిచేస్తున్న అందరికీ పదోన్నతులు కల్పించాలన్నారు. మరణించిన సిబ్బందికి రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు గ్రాట్యూటీ ఇవ్వాలని కోరారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గోవిందు

పిఠాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పాడ బస్టాండు ఆటోయూనియన్ అధ్యక్షుడిగా పలివెల గోవిందు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా వర్ధనపు కృష్ణ, కోశాధికారిగా మంగ శ్రీను, సంయుక్త కార్యదర్శిగా అర్జున్, గౌరవాధ్యక్షులుగా పైలా ఏసుబాబు, ఇంటి చంటిబాబు, పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సూర్యారావుకు సత్కారం

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ సంఘ సేవకుడు, సాహితీవేత్త డాక్టర్ తురగా సూర్యారావును చేయూత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం.రవికుమార్, కార్యదర్శి అలీమ్, సురభి శారద ఆయన్ను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు.

పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పిఠాపురంలో పర్యటించిన డిప్యూటీ సీఎం పేషీ అధికారి శివరామప్రసాద్

పిఠాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్థితిగతులను పరిశీలించడంతో పాటు అక్కడ చేపట్టాల్సిన పనులు, కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మరోమారు దృష్టిసారించారు. పవన్ ఆదేశాల మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారి శివరామప్రసాద్ శుక్రవారం పిఠాపురంతో పాటు కొత్తపల్లి మండలంలో పర్యటించారు. పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సహా పలు పాఠశాలలను సందర్శించారు. అక్కడ పరిస్థితులు, నాడు-నేడు పనులు ఎంత వరకూ జరిగాయి, క్రీడా మైదానాలు, రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, ల్యాబ్‌లు ఏర్పాటు, ఫర్నీచర్, ఇతర సదుపాయాల కల్పనపై పరిశీలన చేశారు. నియోజకవర్గంలోని 52 పాఠశాలలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు నిర్ణయించి అక్కడ కల్పించాల్సిన మౌలిక సౌకర్యాలు, తరగతి గదుల నిర్మాణం తదితరాలపై దృష్టిపెట్టారు. మధ్యలో నిలిచిపోయిన నాడు-నేడు పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని, ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంఈవోలకు సూచించారు. పాఠశాలలను అన్ని సదుపాయాలతో ఉన్నతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పవన్ ఉన్నారని ఆయన తెలిపారు. పాఠశాలలతో పాటు వసతిగృహాలు, ఆసుపత్రులు, పీహెచ్‌సీలపై పవన్ దృష్టి పెట్టారు. అనంతరం ఎంఈవోలతో సమావేశమై పాఠశాలల వారీగా పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి ఎంఈవోలు శ్యాంబాబు, శివప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలల్లో పరిస్థితులపై ఎంఈవోలతో చర్చిస్తున్న అధికారి శివరామప్రసాద్

డిప్యూటీ సీఎం ఆదేశాలతో పాఠశాలకు విద్యుత్ సరఫరా

కొత్తపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మండలంలో నాగులాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యుత్ సదుపాయాన్ని పునరుద్ధరించారు. నాగులాపల్లిలో ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వం నాడు-నేడు ఫేజ్2లో నూతన ఉన్నత పాఠశాల నిర్మాణం చేపట్టారు. అనంతరం పాత ఉన్నత పాఠశాల నుంచి కొత్తగా నిర్మించిన పాఠశాలకు విద్యుత్ పునరుద్ధరించడం కోసం విద్యుత్‌శాఖ గత 2,3 నెలలుగా కాలయాపన చేశారు. విద్యుత్ సదుపాం లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు పడుతున్న విషయం క్షేత్రస్థాయి పరిశీలనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం పేషీ అధికారుల దృష్టికి రావడంతో ఈ విషయం తెలుసుకున్న పాఠశాలకు తక్షణం విద్యుత్ సదుపాయం కల్పించాలని ఆశాధికారులకు ఆదేశించారు. దీంతో వారు నాగులాపల్లిలో నిర్మించిన పాఠశాలకు వెంటనే మీటరు అమర్చి విద్యుత్‌సౌకర్యాన్ని పునరుద్ధరించారు.



కొత్తపల్లి: నాగులాపల్లి ఉన్నత పాఠశాలలో వెలిగిన లైట్లు

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

కాకినాడ రూరల్, అక్టోబరు 18: మంగళగిరిలోని రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజును శుక్రవారం కలిసి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధనపు కార్యదర్శి చెవ్వూరి రవి తెలిపారు. గత మూడేళ్లుగా పాఠశాలలకు నిధులు మంజూరుచేయలేదని, జీవో 117ను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం, పీఈటీ పోస్టులను రద్దు చేయడం వంటివి ఉపసంహరించుకోవాలని కోరామన్నారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు రవి తెలిపారు.

పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్, అక్టోబరు 18: గ్రామాల్లో జరుగుతున్న పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సూచించారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గంగనాపల్లి, చీడిగ, ఇంద్రపాలెం గ్రామాల్లో రూ.2.10 కోట్ల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కనెక్టింగ్ లింక్ రోడ్ల వంటి పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నానాజీ శంకుస్థాపన చేసి శ్రీకారం చుట్టారు. అనంతరం మాట్లాడుతూ ఆగస్టు 22న నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.12.36 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు శిరంగు శ్రీనివాసరావు, మాసుమేను గంగయ్య, పెంకే శ్రీనివాస్‌బాబా, నురుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి, పితాని అప్పన్న, తడాల అబ్బు, పాండ్రంకి రాజు, మరుకుర్తి నాగబాబు, మహేష్, సతీష్, శ్రీరాములు,రమేష్ పాల్గొన్నారు.



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న నానాజీ

గ్రామాలకు ముందుగానే సంక్రాంతి పండుగ

పిఠాపురం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చిందని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పిఠాపురం మండలం కుమారపురం, ఎఫ్‌కేపాలెం, కందరాడ, జల్లూరు, మల్లాం, విరవ, విరవాడ, మంగితుర్తి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, టీడీపీ నేతలతో కలిసి సీసీరోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామపంచాయతీలు నిర్వీర్యమయ్యాయన్నారు. డిప్యూటీ సీఎంగా పవన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు, జనసేన నాయకుడు పిల్లా శివశంకర్ తదితరులున్నారు.



కుమారపురంలో శంకుస్థాపన చేస్తున్న మర్రెడ్డి

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి

పలుచోట్ల సీపీఎం నిరసనలు

కాకినాడ సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కుళాయిచెరువు వద్ద గల ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో రూ.8,114కోట్ల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దువ్వా శేషబాబ్జి, కేఎస్ శ్రీనివాస్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పలివెల వీరబాబు, కె.సింహాచలం, టి.రాజా,సీ.విజయ్‌కుమార్, కె.సత్తిరాజు ఉన్నారు.

సామర్లకోట: రాష్ట్రప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై విధించిన ట్రూఅప్ చార్జీలను వెంటనే నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయలని డిమాండ్ చేస్తూ సామర్లకోట విద్యుత్ ఏడీఈ కార్యాలయం ఎదుట పట్టణ సీపీఎం నాయకులు నిరసన నిర్వహించారు. విద్యుత్ ఈఈకి వినతి అందజేశారు.



కాకినాడలో ధర్నా చేస్తున్న నాయకులు

పెద్దాపురం: ట్రూ ఆప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం అన్యాయమని సీపీఎం పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయలం ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడారు. విద్యుత్‌శాఖ అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేదారి నాగు, సిరిపురపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, మరిడయ్య, అప్పన్న, వీర్రాజు, పెంటయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత

రూ.3లక్షలతో డైనింగ్, స్టడీ హాలు నిర్మాణం



పాఠశాలలో నిర్మించిన డైనింగ్, స్టడీ హాలు

పిఠాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు మున్సిపల్ ఉన్నత పాఠశాలకు అక్కడే చదువుకున్న పూర్వ విద్యార్థి చేయూత ఇచ్చారు. ప్రత్యేకంగా డైనింగ్ అండ్ స్టడీహాలు నిర్మించారు. హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్న ర్యాలీ రవి 1979-80 సంవత్సరంలో ఏకేపీఎం పాఠశాలలో చదువుకున్నారు. పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థులకు డైనింగ్‌హాలు, స్టడీ రూమ్ లేక ఇబ్బందులు పడుతున్నట్టు ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించి రూ.3లక్షల వ్యయంతో డైనింగ్ అండ్ స్టడీ హాలును నిర్మించారు. హాలును శుక్రవారం ఎంఈవో శ్యాంబాబు ప్రారంభించగా, హెచ్‌ఎం సలీనా సపర్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మరిడమ్మకు స్వర్ణపుష్పార్చన

పెద్దాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం శుక్రవారం దేవస్థానం సహయ కమిషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు.



సామర్లకోట రైల్వే స్టేషన్‌కు స్వచ్ఛభారత్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కళ్యాణి

సామర్లకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే స్టేషన్లో సమగ్ర పారిశుధ్య చర్యలు సక్రమంగా నిర్వహించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంలో అధికారులు, సిబ్బంది చేసిన విశేష కృషిని రైల్వే యంత్రాంగం గుర్తించింది. శుక్రవారం విజయవాడ రైల్వే కమ్యూనిటీ హాలులో డీఆర్ఎం నరేంద్ర.ఏ.పాటిల్ చేతులమీదుగా అవార్డును సామర్లకోట చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి అందుకున్నారు. ఉన్నతాధికారులు అభినందించారు.

వ్యక్తృత్వ పోటీల్లో ప్రతిభ

సామర్లకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీఎస్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయిలో జరిగిన వ్యక్తృత్వ పోటీల్లో సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠవాల విద్యారినులు వి.చాందిని, టి.హరిణిసాయిలక్ష్మి ప్రథమస్థానం సాధించినట్టు హెచ్‌ఎమ్ రామకృష్ణ తెలిపారు.

జేఎన్టీయూకే 10వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం

జేఎన్టీయూకే, అక్టోబరు 18: వర్సిటీలోని వీసీ సమావేశ హాల్లో జేఎన్టీయూకే 10వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. దీనికి విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షత వహించి 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన క్రీడా నివేదికను, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ముఖ్యఅతిథిగా ఉపకులపతి, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరానికి సమర్పించిన బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి చర్యలు చేపట్టేలా ఆదేశించారు. డీపీఏ యేసురత్నం, డీపీపీ బాలకష్ణ, డీఈ పద్మజారాణి, ఏయూ వ్యాయామ విద్య డైరెక్టర్ విజయ్‌మోహన్, పలు అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలల పీడీలున్నారు.

'మొక్కలు పెంచాలి'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 18: ఉద్యమంలా మొక్కల పెంచాలని లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ అధ్యక్షుడు ఎంఎస్ఆర్వీ సత్యనారాయణ కోరారు. శుక్రవారం బోట్‌క్లబ్ పార్కులో లయన్స్ క్లబ్ సభ్యులు ఆదిత్య పుట్టినరోజు పురస్కరించుకుని మొక్కలు నాటారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సత్తిరెడ్డి, రత్నప్రసాదరావు, రాఘవులు, సభ్యులు ఉన్నారు.

మందుబాబులకు జైలు

కాకినాడ క్రైం అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి కాకినాడ మూడో స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు జైలు, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాలతో ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు, తన సిబ్బందితో కలిసి నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో గురువారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఏడుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా నలుగురికి ఒక్కొక్కరికీ 2రోజుల చొప్పున జైలు శిక్ష, మరో ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ రమేష్ తెలిపారు.

పేదలకు రైస్‌బ్యాగ్‌ల పంపిణీ

కాకినాడ సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాంవర్మ పుట్టినరోజు సందర్భంగా కాకినాడలో పేదలకు రైస్‌బ్యాగ్‌లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ జనార్ధన్ క్యారేజీ వద్ద పేదలకు భోజన వసతి కల్పించారు. యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు పాల్గొన్నారు.



పెద్దాపురం పురపాలక సంఘం

ఆర్.ఒ.సి.నెం.2981/97-98-ఎ2, తేది:18-10-2024

బహిరంగ వేలము నోటీసు

పెద్దాపురం పురపాలక సంఘ ఆధీనములో గల ఈ దిగువ తెలిపిన షాపురూములను 3 సంవత్సరాల కాలమునకు ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు నెం 56 MA & UD, ది.05.02.2011 ప్రకారం షాపు రూములను లీజు పద్ధతిపై అద్దెకు ఇచ్చుటకు గాను ది.28.10.2024న తేది సోమవారం ఉదయం గం.11-00 ల నుండి పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయము నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఎస్.సి., ఎస్.టి.కేటగిరిలకు రిజర్వ్ చేసిన షాపులకు కుల ధృవీకరణపత్రము దాఖలు చేయవలెను.

క్ర. నెం	షాపింగ్ కాంప్లెక్స్ పేరు	షాప్ నెం.	కేటగిరి	బహిరంగ వేలం/ టెండర్ కమ్ ఆక్షన్	టెండర్ షెడ్యూల్ రుసుము చెల్లించు తేది	టెండర్ షెడ్యూల్ జారీ చేయు తేది	ధరావత్తు & సాల్వెన్సీ రూ
1.	తోట గోపాలకృష్ణ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్	షాప్ నెం.4	జనరల్ కేటగిరి	బహిరంగ వేలం	-	-	10,000/- 25,000/-
2.	వై.ఎస్.ఆర్.మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ (ఖాళీగా ఉన్న అన్ని షాపులు)	మొదటి అంతస్తు షాపు నెం. 27,29	జనరల్ కేటగిరి (2వ పిలుపు)	బహిరంగ వేలం	-	-	10,000/- 25,000/-
		మొదటి అంతస్తు షాపు నెం. 28	జనరల్ కేటగిరి (4వ పిలుపు)	టెండర్ కమ్/ ఓపెన్ ఆక్షన్	రూ.100/-లు 23.10.2024 నుండి 25.10.2024 మధ్యాహ్నం 12.00ల వరకు	28.10.2024 మధ్యాహ్నం 2.00 గం.లకు	10,000/- 25,000/-
		మొదటి అంతస్తు 20,21	జనరల్ కేటగిరి (8వ పిలుపు)				10,000/- 25,000/-
3.	టర్లీ ఎ.పి.ఎస్?ఆర్.టి.సి. కాంప్లెక్స్	1) షాపు నెం.7 2) షాపు నెం.8	1) ఎస్.సి.కేటగిరి 2) ఎస్.టి.కేటగిరి (8వ పిలుపు)				3,000/- 10,000/-
4.	శివాలయం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్	10 మరియు 12	జనరల్ కేటగిరి (7వ పిలుపు)				10,000/- 25,000/-

షరతులు:

1. బహిరంగ వేలం నందు పాల్గొను పాటదారులు ధరావత్తు, సాల్వెన్సీకి చెందిన ఇ.సి.మరియు దస్తావేజు నకళ్లు మొదలగు అన్ని నిబంధనలు వేలం ప్రారంభించుటకు గంట ముందుగా కార్యాలయము వారికి సమర్పించి పాటలో పాల్గొనవలెను. తనఖాలో ఉన్న ఆస్తులకు సంబంధించిన సాల్వెన్సీలు అనుమతించబడవు.
2. టెండర్ కమ్/ఓపెన్ ఆక్షన్ నందు పాల్గొను పాట దారులు ధరావత్తు, సాల్వెన్సీ, సాల్వెన్సీకి చెందిన ఇ.సి.మరియు దస్తావేజు నకళ్లు మొదలగునవి సీల్డ్ టెండర్లు తేది 28.10.2024 మధ్యాహ్నం 3.00 గంటలలోపు దాఖలైన టెండర్లను టెండరు దారుల సమక్షములో తెరిచి వెంటనే వాటికి బహిరంగ వేలం నిర్వహించబడును.
3. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలో ఎ2 గుమాస్తా వారిని సంప్రదించవలెను.
4. ఏదైనా కారణముగా చేత పాటను వాయిదా / రద్దు పరచే పూర్తి అధికారము కమిషనర్ వారికి కలదు

కమిషనరు,
పెద్దాపురం పురపాలక సంఘం

'లోవ'లో పాడేరు ఎమ్మెల్యే పూజలు

తుని రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పూజలు ఆచరించారు. తలుపులమ్మను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహా మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ ఈవో పి.విశ్వనాదరాజు అమ్మవారి మహాప్రసాదాన్ని అందజేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

'ప్రత్యేక జిల్లా హామీని నెరవేర్చండి'

ఎటపాక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ముంపు పేరుతో విలీనం చేసుకున్న పోలవరం మండలాలను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ అల్లూరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి టీడీపీ అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రిని కలిసి ఈ మేరకు విన్నవించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అరకు ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు పోలవరం ముంపు మండలాలను కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, దాని అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగు ముంపు మండలాల్లో అభివృద్ధి పనులు, వ్యవసాయానికి ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయాలని కోరారు. ఈ అంశాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి: సబ్ కలెక్టరు కల్పశ్రీ



రంపచోడవరం, అక్టోబరు 18: ఏజెన్సీలో బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టరు, బాల్య వివాహాల నిర్మూలన ఛైర్‌పర్సన్ కల్పశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. బాలికలకు 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేస్తే శిక్షార్హులవుతారన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. బాల్య వివాహాలు చేస్తే 109, 100, 1098 టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడీపీవో సంధ్యారాణి, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, సీఐ రవికుమార్, ఏటీడబ్ల్యూవో రామతులసి, ఎంఈవో రామకృష్ణ, వెలుగు డీపీఎం పరమేశ్వరరావు, హెల్త్ మానిటరింగ్ అధికారులు ఝాన్సీ, రమణి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



చింతూరులో పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్



వై.రామవరం మండలంలో శ్రమదానంలో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర

'పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యత'

చింతూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ కోరారు. స్థానిక సంత మార్కెట్ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని చెత్తను శుభ్రం చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గుంపెనపల్లి మోహన్, తహసీల్దారు చిరంజీవి, సర్పంచ్ కారం కన్నారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బుచ్చిబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, నాయకులు సయ్యద్ ఆసిఫ్, ఎండీ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం: చదలవాడ పంచాయతీ తులసిపాక పీహెచ్‌సీలో శుక్రవారం 'స్వచ్ఛత హి సేవ' నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది ప్లాస్టిక్ సీసాలు, పొడి, తడి వ్యర్థాలు, పొదలను తొలగించారు. పీహెచ్‌సీ సిబ్బంది, లక్కవరం పంచాయతీ కార్యదర్శి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వై.రామవరం: అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో శుక్రవారం పలు పంచాయతీల్లో శ్రమదానం చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే, హౌసింగ్ డే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రామం మధ్యలో మద్యం దుకాణం వద్దు'



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రేపకల్లి గ్రామస్తులు

వరరామచంద్రాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామం మధ్యలో మద్యం దుకాణం వద్దంటూ రేఖపల్లి ప్రజలు శుక్రవారం తహసీల్దారు సరస్వతికి వినతిపత్రం అందచేశారు. మద్యం దుకాణం చుట్టుపక్కల ఉన్న కుటుంబాల వారు మాట్లాడుతూ ... ఇక్కడ మద్యం దుకాణం కారణంగా నాలుగైదు సంవత్సరా లుగా తామంతా చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. మద్యం దుకాణాన్ని ఇక్కడి నుంచి తరలించాలని గతంలోనూ అధికారులకు వినతిపత్రం ఇచ్చామన్నారు. అను నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుందని, పనిమీద బయటకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామన్నారు. తమ బాధను అర్థం చేసుకుని మద్యం దుకాణాన్ని మార్చాలని కోరారు. విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వడ్డిగూడెంలోనే మద్యం దుకాణం నిర్వహించాలని సర్పంచ్ సోడి నర్సమ్మ ఒక ప్రకటనలో కోరారు. ఈ పంచాయతీకి వచ్చిన షాపును ఈ గ్రామ పరిధిలోనే నిర్వహించాలని, వేరే ఊరిలో పెట్టే ఆలోచన మానుకోవాలన్నారు. ఇక్కడి ప్రజలకు ఇబ్బంది కలగకుండా దుకాణం ఏర్పాటు చేసుకోవాలన్నారు.

'స్మార్ట్ మీటర్లతో ఉసురు తీయకండి'

వరరామచంద్రాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల పేరుతో వినియోగదారులు ఉసురుతీయొద్దని సీపీఎం జిల్లా నాయకుడు పూనెం సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులు మోటారు సైకిళ్లపై ర్యాలీగా భీమవరం సబ్ స్టేషన్ దగ్గరకు వెళ్లి అక్కడ నిరసన తెలిపారు. విద్యుత్ శాఖ జేఈకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. స్మార్ట్ మీటర్లపై నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని జిల్లా కమిటీ సభ్యుడు సత్యనారాయణ కోరారు. వరదల కారణంగా రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని, వారిపై భారం మోపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఎంపీపీ కారం లక్ష్మి, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్, నాయకులు పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య, పొడియం శ్రీరామమూర్తి, సుందరయ్య లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిపాకలో 'పల్లె పండుగ'



ఎటపాక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'పల్లె పండుగ'లో భాగంగా శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. స్వచ్ఛభారత్‌లో రహదారుల వద్ద, బడుల వద్ద చెత్తాచెదారాలను శుభ్రం చేశారు. నెల్లిపాకలో విద్యార్థులు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో రహదారిపై మానవహారం నిర్మించారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని నినాదాలు చేశారు.

ఇందుకూరులో భారీ అన్నసమారాధన

దేవీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు గ్రామ శివారున గల శ్రీకనకదుర్గమ్మ తల్లి ఆలయంలో దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఇందుకూరు, ఇందుకూరుపేట, ఫజుల్లాబాద్, కొత్తవీధి, బియ్యంపల్లి తదితర గ్రామాల భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా ఎమ్మెల్యే నెహ్రూ జన్మదినం

శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



జగ్గంపేటలో ఎమ్మెల్యేకు వెండి కిరీటం, వెండి దండతో శుభాకాంక్షలు తెలుపుతున్న తుమ్మలపల్లి



ప్రత్తిపాడు: నెహ్రూకు కేక్ తినిపిస్తున్న సత్యప్రభ

జగ్గంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జన్మదినం సందర్భంగా జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, జనసేన పార్టీ నాయకులు, అనుచరులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నెహ్రూతో తుమ్మలపల్లి కేక్ కట్ చేయించారు. వెండి కిరీటం, వెండి దండ, శాలువాతో నెహ్రూని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలు, ఆరోగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేడిబోయిన శ్రీను, సూరంపాలెం బాలు, ఎల్లపు దొరబాబు, మాదారపు వీరబాబు, ఉలిసి ఐరాజు, మరిసే రామకృష్ణ, గంధం ప్రభాకర్, కుంచే కోటి, కర్నాకుల సూరిబాబు, కాయల మణికంఠ, పాలెం బాబి, గోకేడ ప్రసాద్ పాల్గొన్నారు. నెహ్రూ జన్మదిన వేడుకలను జగ్గంపేటలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్సీలు వరుపుల సుబ్బారావు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, మాజీ ఎమ్మెల్సీలు రెడ్డి సుబ్రహ్మణ్యం, చైతన్యరాజు, గన్నికృష్ణ, నిమ్మకాయల రంగనాద్, రాజా సూరిబాబురాజు, రోజోలు మాజీ జడ్పీటీసీ సాయిబాబా రాజు, జిల్లాతెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసచార్యులు, సుంకర తిరుమల కుమార్ విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. గొల్లలగుంట జడ్పీ హైస్కూల్‌లో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, లక్ష్మి దంపతులు హాజరై ప్రారంభించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ బస్వా చినబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, నియోజకవర్గ టీడీపీ నాయకులు ప్రత్తిపాడు నుంచి ఇర్రిపాక వెళ్లి ఎమ్మెల్యే జ్యోతుల దంపతులకు శాలువా కప్పి గజమాలతో సన్మానించి కేక్ కట్ చేయించి పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, పర్వత సురేష్, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, వెన్నా శివ, దాట్ల అప్పన్నబాబు, జ్యోతుల పెదబాబు, బద్ది రామారావు, బొదిరెడ్డి గోపి, ఇళ్ళ అప్పారావు, మంతెన శ్రీను, మిరియాల శ్రీను, యర్రాబత్తుల గోవిందనాయుడు పాల్గొన్నారు.

రౌతులపూడి: ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో పాటు మండల టీడీపీ నాయకుడు ఇటంశెట్టి అశోక్, అనుచరులతో జగ్గంపేట తరలివెళ్లి ఎమ్మెల్యే నెహ్రూకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పుస్తకాలు, పెన్నుల బహుమతి

గండేపల్లి: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్ వెయ్యి పుస్తకాలు, పెన్నులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మండల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు భారీగా తరలివెళ్లి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, పరిమి బాబు, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, ఎంపీడీవో నాతి బుజ్జి, పెనుమర్తి భాస్కరరావు, వెంకటేశ్వరరైస్ ఇండస్ట్రీస్ అధినేత మండవిల్లి వెంకటేశ్వరరావు, సుబ్బారావు, వెలమాటి కాశీ, పెనుమర్తి భాస్కరరావు, బూరా ప్రసాద్, బచ్చు మల్లేశ్వరరావు, సుంకవిల్లి సత్యనారాయణ, మాదిరెడ్డి కృష్ణార్జున, పెనుమర్తి అర్జునరావు, దేవిశెట్టి బాబ్జి, దొమ్మా శ్రీను, దాపర్తి సీతారామయ్య, మద్దిపూడి సత్యనారాయణ, కొత్త శివ పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి మండల టీడీపీ నాయకులు జగ్గంపేట వెళ్లి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, భూపాలపట్నం ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, జగపతినగరం సర్పంచ్ శ్రీలత రాంబాబు, కుర్ల చినబాబు, తూము కుమార్, కాళ్ల వెంకటేష్, ఆళ్ల నానాజీ, ఆళ్ల బాబులు, శ్రీమన్నారాయణ, భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, గంధం ఈశ్వరరావు, గొడే దొరబాబు, సూరిశెట్టి వెంకట శివ, మంచికంటి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు, జట్ల వీరసదాసాంబశివరావు, శృంగరాయునిపాలెం సర్పంచ్ పట్టు చంటిబాబు, ఎంపీటీసీ గరగాగోవిందు, ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, సత్యానందం, గొడే బాల, దొరబాబు, కాసులు, తాసు ఉన్నారు.

'బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి'

ప్రత్తిపాడు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని రాష్ట్ర నాయకులు రావూరి సుధ పిలుపునిచ్చారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించగా పరిశీలించిన సుధ, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొక్కిరిగడ్డ గంగాధర్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజులు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గున్నాబత్తుల రాజబాబు, దేవర రామకృష్ణయాదవ్, నక్కా శ్రీనివాస్, రాజా కింగ్‌బాబు రాజు, మదినే బాబ్జి, కొండి సత్తిబాబు, బాలుదొర, బొమ్మిడి లోవరాజు పాల్గొన్నారు.

బృందగాన పోటీలు

తుని రూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస పరిషత్తు తునిశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బృందగాన పోటీలు తుని చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్‌లో నిర్వహించారు. తుని శాఖ అధ్యక్షుడు ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 10 పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. పట్టణంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు విద్యార్థులు ప్రథమ బహుమతి, లయోలా విద్యాసంస్థలు ద్వితీయ బహుమతులకు ఎంపిక కాక భారత వికాస పరిషత్తు సభ్యులు బహుమతులందజేశారు.

టీడీపీ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

తుని రూరల్/ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళగిరి జాతీయ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమీక్షా సమావేశానికి తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలు, సంక్షేమ పథకాలు అమలు అంశాలను ముఖ్యమంత్రికి వివరించినట్టు తెలిపారు.



సమావేశంలో ఎమ్మెల్యేలు దివ్య, సత్యప్రభ

రోగులకు మెరుగైన సేవలందించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత



ఏలేశ్వరంలో ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న సరిత

ఏలేశ్వరం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): రోగలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పి.సరిత ఆదేశించారు. శుక్రవారం పట్టణంలో పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆమె సందర్శించి రికార్డులు, రోగుల గదులు, స్కానింగ్ మెషీన్ తనిఖీ చేశారు. అనంతరం సరిత మాట్లాడుతూ రోగులకు మంచి వైద్యం అందిస్తూ తక్కువ రుసుం తీసుకోవాలని వైద్యులకు సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, వాటిపై గర్భిణులకు తగు సలహాలు, సూచనల ఇవ్వాలని తెలిపారు. ఆమె వెంట జె.అన్నవరం మెడికల్‌ఆఫీసర్ డాక్టర్ శ్రీలక్ష్మీ తదితరులున్నారు.

18 మంది పోలీసుల బదిలీ



బదిలీ అయిన సిబ్బందితో తుని సీఐ

తుని రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తుని పోలీస్‌స్టేషన్లో ఇప్పటివరకు విధులు నిర్వహించిన 18 మంది పోలీసులకు స్థానచలనం కలిగింది. విశేష సేవలందించిన సిబ్బందిని సీఐ గీతారామకృష్ణ, పలువురు ప్రముఖులు సన్మానించారు. బదిలీ అయిన వారిలో ఇద్దరు ఏఎస్‌ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుల్స్, 13 మంది కానిస్టేబుల్స్ ఉన్నట్టు సీఐ తెలిపారు.

'ఆదిత్య'లో యూఎస్‌ఏ ఎడ్యుకేషన్ ఫెయిర్




ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభిస్తున్న దృశ్యం

గండేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం యూఎస్‌ఏ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2024ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించింది. ప్రతిష్ఠాత్మకమైన అమెరికన్ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో ఈ ఫెయిర్‌కు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, విద్యావేత్తలు వచ్చారు. తుల్సా విశ్వవిద్యాలయం, యూనివర్శిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్, వెబ్‌స్టర్ విశ్వవిద్యాలయం, యూనివర్శిటీ ఆఫ్ సౌత్ అలబామా, మిడిల్ టేనస్సీ స్టేట్ యూనివర్శిటీ, యూనివర్శిటీ ఆఫ్ సౌత్ కరోలినా అప్‌స్టేట్, ఇల్లినాయిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రూజ్‌వెల్ట్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు తమ సంబంధిత సంస్థలు, విద్యా కార్యక్రమాలు, స్కాలర్‌షిప్‌లు, దరఖాస్తు విధానాలు, కాంపస్ జీవితంపై సమాచారాన్ని అందించారు. ఆదిత్య యూనివర్శిటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ విదేశీ విద్య అభ్యసించాలనే విద్యార్థులకు కోసం ఈ ఫెయిర్ ఏర్పాటు చేశామన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం : సీఐ

ప్రత్తిపాడు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు కోరారు. రాచపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన గ్రామసభలో సీఐ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల నివారణకు సురక్షితంగా వాహనాలు నడపడమే ఉత్తమమని తెలిపారు. మద్యం తాగి, హెల్మెట్ లేకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. సైబర్‌నేరాల లింకులు పరిశీలించవద్దన్నారు. ఎస్‌ఐ ఎస్ లక్ష్మీకాంతం, అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యుడు బుద్దరాజు గోపిరాజు, గ్రామస్తులున్నారు.



కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

వై.రామవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, నాటుసారా అమ్మకాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని వై.రామవరం ఎస్‌ఐ బి.రామకృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన జూనియర్ కళాశాల విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వర్‌కృప, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎటపాక తహసీల్దారుగా సుబ్బారావు బాధ్యతల స్వీకారం



ఎటపాక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎటపాక తహసీల్దారుగా కారం సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మారేడుమిల్లి నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇప్పటివరకు తహసీల్దారుగా పని చేసిన పృథ్వీ ఇటీవల రిలీవ్ అయ్యారు.

ఘనంగా చండీహోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నవరం ఆలయ క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలనర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనం అనంతరం తీర్థప్రసాదాలందజేశారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తుని రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రానున్న కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రసిద్ధి దేవాలయాలకు తుని ఆర్టీసీ డిపోనుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ ఎంఈ మనోహర్ తెలిపారు. తుని డిపో నుంచి పంచారామ క్షేత్రాలతో పాటుగా శబరిమలై, అరుణాచలం, తిరుపతి, భద్రాచ లం వంటి క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా తీర్థయాత్రలకు బస్సులు నడుపుతున్నట్టు ఆయన తెలిపారు.

గౌరీదేవి ఊరేగింపు

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో శుక్రవారం రాత్రి గౌరీదేవి ఊరేగింపు వైభవంగా జరిగింది. స్థానిక నంది సెంటర్ రామాలయం నుంచి గౌరీదేవి అమ్మవారిని మేళతాళలు, మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. గౌరీశంకర్ల 88వ వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభంలో భాగంగా అట్లతద్ది ముందురోజు అమ్మవారిని సంప్రదాయబద్ధగా ఊరేగించి సీతంపేట రామాలయం వద్ద గల గౌరీశంకర్ల మందిరంలో ప్రతిష్ఠించడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు గ్రామంలో ఊరేగించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవంలో భాగంగా వేంకటేశ్వర స్వామి ప్రదర్శన, గరగల నృత్యం ఆకట్టుకున్నాయి.

'విద్యుత్ చార్జీలు తగ్గించాలి'

తుని రూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించి పేద మధ్య తరగతి కుటుంబాలను ఆదుకోవాలని తునిలో సీపీఎం పార్టీప్రతినిధులు ఆందోళన చేపట్టారు. ఏపీ ఈపీడీసీఎల్ విద్యుత్ ఉప కేంద్రం వద్ద నినాదాలు చేస్తూ పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల మీద కరెంటు రూపంలో ఉన్న భారాన్ని తగ్గించాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల సీపీఎం నేతలు నెక్కెళ్ళ శ్రీనివాస్, గొర్ల వెంకటరమణ, నాగేశ్వరరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం పురపాలక సంఘం

ఆర్.ఒ.సి.నెం.2981/97-98-ఎ2, తేది:18-10-2024

బహిరంగ వేలము నోటీసు

పెద్దాపురం పురపాలక సంఘ అధీనములో గల ఈ దిగువ తెలిపిన షాపురూములను 3 సంవత్సరాల కాలమునకు ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు నెం 56 MA & UD, ది.05.02.2011 ప్రకారం షాపు రూములను లీజు పద్ధతిపై అద్దెకు ఇచ్చుటకు గాను ది.28.10.2024న తేది సోమవారం ఉదయం గం.11-00 ల నుండి పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయము నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఎస్.సి., ఎస్.టి.కేటగిరిలకు రిజర్వ్ చేసిన షాపులకు కుల ధృవీకరణపత్రము దాఖలు చేయవలెను.

వ. నెం	షాపింగ్ కాంప్లెక్స్ పేరు	షాప్ నెం.	కేటగిరి	బహిరంగ వేలం/ టెండర్ కమ్ ఆక్షన్	టెండర్ షెడ్యూల్ రుసుము చెల్లించు తేది	టెండర్ షెడ్యూల్ జారీ చేయు తేది	ధరావత్తు & సాల్వెన్సీ రూ
1.	తోట గోపాలకృష్ణ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్	షాప్ నెం.4	జనరల్ కేటగిరి	బహిరంగ వేలం	-	-	10,000/- 25,000/-
2.	వై.ఎస్.ఆర్.మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ (ఖాళీగా ఉన్న అన్నీ షాపులు)	మొదటి అంతస్తు షాపు నెం. 27,29	జనరల్ కేటగిరి (2వ పిలుపు)	బహిరంగ వేలం	-	-	10,000/- 25,000/-
		మొదటి అంతస్తు షాపు నెం. 28	జనరల్ కేటగిరి (4వ పిలుపు)	టెండర్ కమ్/ ఓపెన్ ఆక్షన్	రూ.100/-లు 23.10.2024 నుండి 25.10.2024 మధ్యాహ్నం 12.00ల వరకు	28.10.2024 మధ్యాహ్నం 2.00 గం.లకు	10,000/- 25,000/-
		మొదటి అంతస్తు 20,21	జనరల్ కేటగిరి (8వ పిలుపు)				10,000/- 25,000/-
3.	ఓల్డ్ ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. కాంప్లెక్స్	1) షాపు నెం.7 2) షాపు నెం.8	1) ఎస్.సి.కేటగిరి 2) ఎస్.టి.కేటగిరి (8వ పిలుపు)				3,000/- 10,000/-
4.	శివాలయం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్	10 మరియు 12	జనరల్ కేటగిరి (7వ పిలుపు)				10,000/- 25,000/-

షరతులు:

1. బహిరంగ వేలం నందు పాల్గొను పాటదారులు ధరావత్తు, సాల్వెన్సీకి చెందిన ఇ.సి.మరియు దస్తావేజు నకళ్లు మొదలగు అన్ని నిబంధనలు వేలం ప్రారంభించుటకు గంట ముందుగా కార్యాలయము వారికి సమర్పించి పాటలో పాల్గొనవలెను. తనఖాలో ఉన్న ఆస్తులకు సంబంధించిన సాల్వెన్సీలు అనుమతించబడవు.
2. టెండర్ కమ్/ఓపెన్ ఆక్షన్ నందు పాల్గొను పాట దారులు ధరావత్తు, సాల్వెన్సీ, సాల్వెన్సీకి చెందిన ఇ.సి.మరియు దస్తావేజు నకళ్లు మొదలగునవి సీల్డ్ టెండర్లు తేది 28.10.2024 మధ్యాహ్నం 3.00 గంటలలోపు దాఖలైన టెండర్లను టెండరు దారుల సమక్షములో తెరిచి వెంటనే వాటికి బహిరంగ వేలం నిర్వహించబడును.
3. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలో ఎ2 గుమాస్తా వారిని సంప్రదించవలెను.
4. ఏదైనా కారణముగా చేత పాటను వాయిదా / రద్దు పరచే పూర్తి అధికారము కమిషనర్ వారికి కలదు

కమిషనరు,
పెద్దాపురం పురపాలక సంఘం